విశాఖపట్టణం
గురువారం 16 ఏప్రిల్ 2026

For a pure tomorrow..

జయ జయహే


jayajayahey.in సంపుటి: 9 సంచిక: 82 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# అమరావతి పేరు ఇలా రాయాలి

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

(అమరావతి - జయజయహే)



ప్రభుత్వం రాజధాని అమరావతి పేరుకు సంబంధించిన అధికారిక ఆంగ్ల స్పెల్లింగ్‌పై స్పష్టతనిచ్చింది. ఇకపై అన్ని ప్రభుత్వ పత్రాలు, డిజిటల్ రికార్డులు, అధికారిక ఉ త్తరప్రత్యుత్తరాల్లో Amaravati (టిఐ తో అంతమయ్యేది) అనే స్పెల్లింగ్‌ను మాత్రమే ఉపయోగించాలని జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ అన్ని శాఖలకు సర్క్యులర్ జారీ చేసింది. అమరావతి పేరును కొందరు ష్ట్ర అక్షరాన్ని జోడించి లేదా చివర తి బదులు థి (thi)తో రాస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ..మిగతా 2లో



## ఆందోళన అనవసరం

### ప్రాతినిధ్యం తగ్గబోదు

### దమాషా పద్ధతి ప్రకారం మార్పు ఉండబోదు

### కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కోసం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్రవర్గాలు తెలిపాయి. లోక్‌సభలో అన్ని రాష్ట్రాల వాటాను ఏకరీతిగా 50శాతం పెంచనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పినట్లు జాతీయ మీడియా పేర్కొంది. దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందాల్సిన పనిలేదని కేంద్రవర్గాలు పేర్కొన్నాయి. 2011 జనాభా లెక్కలు ఇక్కడ నిర్ణయాత్మక అంశం కావని తెలిపాయి. అంటే దామాషా పరంగా చూస్తే ఎటువంటి మార్పూ ఉండదని, ప్రాతినిధ్యం తగ్గుతుందేమోనన్న దక్షిణాది ఆందోళనలను ఈ విధానం నివారిస్తుందని వివరించాయి. దక్షిణాది రాష్ట్రాలకు ఎటువంటి నష్టమూ వాటిల్లదని, ప్రతీ రాష్ట్రానికి కేటాయించిన సీట్ల సంఖ్య కూడా 50 శాతం పెరుగుతుందని స్పష్టం చేశాయి. మరోవైపు నియోజకవర్గాల పునర్విభజనను ప్రతిపక్ష కూటమి వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి ..మిగతా 2లో

# చారిత్రాత్మక రాజకీయం..!

### నేటి నుంచి ప్రత్యేక పార్లమెంట్

### సభకు పునర్విభజన, మహిళా బిల్లు

### దక్షిణాది నష్టమంటున్న కొందరు సీఎంలు

### జనాభా ప్రాతిపదిక విభజన సరికాదని వాదన

### అభివృద్ధి ఆధారంగా చేయాలని డిమాండ్






(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

నియోజకవర్గాల పునర్విభజన అంశం భారత రాజకీయాల్లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారింది. గురువారం నుండి ప్రారంభం కానున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ప్రభుత్వం దీనికి సంబంధించిన కీలక బిల్లులను ప్రవేశపెట్టబోతోంది. ఈ నేపథ్యంలో అసలు ఈ బిల్లుల సారాంశం ఏమిటి? దక్షిణాది రాష్ట్రాలు వీటిని ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి? ప్రభుత్వం చెబుతున్న వాదనలేంటి? అనే అంశాలపై ఒక సమగ్ర విశ్లేషణ ఒక్కసారి పరిశీలిద్దాం.. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు చారిత్రక మార్పు దిశగా అడుగులు వేస్తోంది. దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే విధంగా ప్రభుత్వం మూడు ప్రధాన బిల్లులను సభ ముందుకు తీసుకువస్తోంది. రాజ్యాంగ 131వ సవరణ బిల్లు, 2026: దీని ప్రకారం లోక్‌సభ సభ్యుల సంఖ్య ప్రస్తుతమున్న 543 నుండి 850కి పెరుగుతుంది. ఇందులో రాష్ట్రాల నుండి 815 మంది, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 35 మంది సభ్యులు ఉ ంటారు. డీలిమిటేషన్ బిల్లు, 2026: జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల సరిహద్దులను మార్చడానికి, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రిజర్వేషన్లను ఖరారు చేయడానికి ఒక శక్తివంతమైన 'డీలిమిటేషన్ కమిషన్'ను ఇది ఏర్పాటు చేస్తుంది. కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు, 2026: పెరిగిన సీట్లు, మహిళా రిజర్వేషన్లను కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు చేసేలా ..మిగతా 2లో

# చంద్రబాబు తాత తరం కూడా కాదు

### ఫిషింగ్ హార్బర్లు మత్స్యకారుల హక్కు

### ఎవరికి ఇచ్చినా లాక్కుని తిరిగి ఇస్తాం

### కళ్లు మూసుకుంటే మూడేళ్లు గడిచిపోతోంది

### ఎల్లకాలం ఈ ప్రభుత్వం కొనసాగదు

### కూటమి ప్రభుత్వంపై వైఎస్ జగన్ మండిపాటు

### జువ్వలదిన్నె హార్బర్ లో పర్యటన



(నెల్లూరు - జయజయహే)

రాష్ట్రంలో అన్ని రంగాల్లో అన్యాయాలు జరుగుతున్నాయని , ఫిషింగ్ హార్బర్లను దుర్మార్గంగా ప్రైవేటీకరణ చేస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం వైఎస్ జగన్ జువ్వలదిన్నె పర్యటించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఫిషింగ్ హార్బర్ లను దుర్మార్గంగా ప్రైవేటీకరణ చేస్తున్నారు. మా హయాంలో నాలుగు పోర్టులు, 10 హార్బర్ లు, 6 ఫిష్ ల్యాండ్ సెంటర్లు పనులు చేపట్టాం . దాదాపు 26 వేల కోట్ల పెట్టుబడులతో వీటి పనులకు శ్రీకారం చుట్టాం. రెండేళ్లుగా మేము ప్రారంభించిన పోర్టులు హార్బర్లు పనులు జరగడం లేదని జగన్ అన్నారు. జువ్వలదిన్నె ..మిగతా 2లో

## 23న రాంబిల్లి సెజ్‌కు చంద్రబాబు

### రెన్యూ సోలార్ పరిశ్రమకు శంకుస్థాపన



3

## ఇంటర్ ఉత్తీర్ణతలో రికార్డు

### సెకండ్ ఇయర్‌లో 81 శాతం పాస్

### 12 ఏళ్ల తర్వాత రికార్డు ఉత్తీర్ణత

### ఫస్టియర్‌లో 77 శాతం పాస్

2



## నేటి నుంచి జనగణన

### సెల్ఫ్ సన్సస్‌కు శ్రీకారం

### అడ్డంకులు సృష్టిస్తే క్రిమినల్ చర్యలు

### జనగణన అధికారి జే నివాస్ హెచ్చరిక

(అమరావతి - జయజయహే)

గురువారం నుంచి రాష్ట్రంలో సెన్సస్ 2027 ప్రక్రియ ప్రారంభించనున్నట్లు రాష్ట్ర జనగణన అధికారి జె. నివాస్ స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రణాళికలకు సెన్సస్ ప్రామాణికమని తెలిపారు. ప్రస్తుతం జరిగేది 16వ సెన్సస్ అని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 8వ సెన్సస్ అని నివాస్ వివరించారు. జనాభా గణన ఫిబ్రవరిలో ప్రారంభమవుతుందని, ఈ లోపు హౌస్ లిస్టింగ్ జరుగుతుందని స్పష్టం చేశారు. సెన్సస్ ప్రక్రియకు ప్రజలు పూర్తి సహకరించాలని కోరారు. ఎన్యూమరేటర్లకు అవసరమైన వివరాలు తప్పకుండా అందించాలని, ఇంటి నంబర్లు నమోదు చేసే ప్రక్రియకు ఎటువంటి అడ్డంకులు ..మిగతా 2లో

# నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్

### రాష్ట్ర పార్టీ అధ్యక్షుడుగా పల్లా కొనసాగింపు

### 29 మందితో పొలిట్ బ్యూరో.. 31 మందితో జాతీయ కమిటీ

### బీసీలకు 40 శాతం పదవుల్లో ప్రాధాన్యత

(అమరావతి - జయజయహే)

తెలుగుదేశం పార్టీలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు టీడీపీకి సంబంధించిన పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను బుధవారం ప్రకటించారు. జాతీయ స్థాయిలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలను మంత్రి నారా లోకేష్‌కు అప్పగించగా, రాష్ట్ర అధ్యక్షుడిగా



## గేమ్ ఛేంజర్ టీమ్

### కమిటీల్లో లోకేశ్ ముద్ర స్పష్టం


### యువతకు కీలక స్థానాల్లో పెద్దపీట.. యువగళం బృందానికి ప్రాధాన్యత

2

## డిలిమిటేషన్‌కు వైసీపీ సపోర్టు

### బిల్లుతో ఇబ్బందులు లేవన్న సజ్జల

(తాడేపల్లి - జయజయహే)



నియోజకవర్గాల పునర్విభజన అంశం ఇప్పుడు దేశవ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఒక రాజకీయ ప్రకంపనగా మారింది. 2029 ఎన్నికల నాటికి లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కి పెంచాలన్న కేంద్ర ప్రతిపాదనపై దక్షిణాది పార్టీలన్నీ నిరసన గళం విప్పుతుంటే, ఆంధ్రప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం భిన్నంగాది. ఎన్డీయే కూటమిలో లేకపోయినప్పటికీ, ఈ బిల్లుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బేషరతు మద్దతు ప్రకటించింది. సాధారణంగా దక్షిణాది ప్రాంతీయ ప్రయోజనాల ..మిగతా 2లో

# చారిత్రాత్మక రాజకీయం..!

మొదటి పేజీ తరువాయి...

ఈ బిల్లు మార్పులు సూచిస్తుంది. ఈ ప్రతిపాదనలపై తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. జనాభాను నియంత్రించి, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తమకు, ఈ జనాభా ఆధారిత సీట్ల పెంపు అన్యాయం చేస్తుందని అవి భావిస్తున్నాయి. ప్రధానంగా తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్ దీనిని రాష్ట్ర ప్రయోజనాలపై దాడి అని అభివర్ణించగా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇది దేశ సమాఖ్య వ్యవస్థ సమతుల్యతను దెబ్బతీస్తుందని దేశ ప్రధానికి లేఖ రాశారు. జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరగడం వల్ల, భవిష్యత్తులో దేశ రాజకీయ నిర్ణయాధికారంలో దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కబడుతుందనేది ప్రధాన ఆందోళన. మాజీ కేంద్ర మంత్రి చిదంబరం గణాంకాలతో వివరిస్తూ, ప్రస్తుత నియోజకవర్గాల మార్పు వల్ల దక్షిణాది రాష్ట్రాల వాటా 24.3% నుండి 20.7%కి పడిపోతుందని హెచ్చరించారు. ఇది ఒక దురుద్దేశపూరిత కుట్ర అని ఆయన విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ప్రధాన రాష్ట్రాల్లో సీట్ల మార్పులు ఈ విధంగా ఉండే అవకాశం ఉంది:

తమిళనాడు ప్రస్తుతం 39 లోక్‌సభ స్థానాలను కలిగి ఉంది. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 49 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 59 స్థానాలు లభిస్తాయి. కేరళలో ప్రస్తుతం 20 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 23 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 30 స్థానాలు లభిస్తాయి. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, ప్రస్తుతం రాష్ట్రంలో 25 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 33 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 37 స్థానాలు లభిస్తాయి.

తెలంగాణ ప్రస్తుతం 17 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 24 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 25 స్థానాలు లభిస్తాయి. ఒడిశా ప్రస్తుతం 21 స్థానాలను కలిగి ఉంది. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 28 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 31 స్థానాలు లభిస్తాయి. కర్ణాటకలో ప్రస్తుతం 28 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజన కేవలం 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరిగి ఉంటే, దానికి 41 స్థానాలు లభించి ఉండేవి. కానీ, అన్ని రాష్ట్రాల వాటాలను దామాషా పద్ధతిలో 50% మేర పెంచాలన్న భారత ప్రభుత్వ సూత్రం ప్రకారం, ఇప్పుడు దానికి 42 స్థానాలు లభిస్తాయి. అయితే ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం 80 స్థానాల ఉండగా, గణనీయంగా 140పైగా లోక్‌సభ స్థానాలు పెరిగే అవకాశం కనిపిస్తోంది.

ప్రతిపక్షాల వాదన ప్రకారం, కేవలం జనాభా ఆధారంగా చూస్తే తమిళనాడు సీట్లు తగ్గవచ్చు. కానీ ప్రభుత్వం ప్రతిపాదించిన 'దామాషా పద్ధతి'లో అవి పెరిగినట్లు కనిపిస్తున్నా.. ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాది ప్రాబల్యం తగ్గుతుందనేది వారి అసలు పాయింట్. ప్రతిపక్షాల ఆరోపణలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తోసిపుచ్చారు. 1971 జనాభా లెక్కల ఆధారంగా ఉన్న వ్యవస్థ ఇప్పుడు కాలం చెల్లిందని ప్రభుత్వం వాదిస్తోంది. ప్రతి ప్రాంతానికి, ప్రతి వర్గానికి మేలు జరిగేలా ఈ బిల్లులను రూపొందించామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. జనాభా అదుపులో ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు కూడా సీట్లు పెరుగుతాయని, కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. మహిళలకు 33% రిజర్వేషన్లు అమలు కావాలంటే డీలిమిటేషన్ ప్రక్రియ తప్పనిసరి అని, 15 ఏళ్ల పాటు ఈ రిజర్వేషన్లు కొనసాగుతాయని ప్రభుత్వం గుర్తు చేస్తోంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రజల సమస్యలను సభలో వినిపించడానికి సభ్యుల సంఖ్య పెరగడం ప్రజాస్వామ్యానికి అవసరమని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

సోనియా గాంధీ వంటి అగ్రనేతలు సైతం రాజకీయ ప్రాతినిధ్యంలో వచ్చే ఈ పెనుమార్పులు రాజ్యాంగ సూత్రాలను దెబ్బతీస్తాయని హెచ్చరిస్తున్నారు. కేవలం జనాభా ప్రాతిపదికన కాకుండా, అభివృద్ధిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. గురువారం నుండి జరగబోయే ఈ మూడు రోజుల సమావేశాలు కేవలం బిల్లుల ఆమోదానికే పరిమితం కాకుండా, ఉత్తర-దక్షిణ భారత రాష్ట్రాల మధ్య నెలకొన్న రాజకీయ, ఆర్థిక అసమానతలపై చర్చకు వేదిక కానున్నాయి. ప్రభుత్వం ఈ ఆందోళనలను ఎలా శాంతింపజేస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# గేమ్ ఛేంజర్ టీమ్

## కమిటీల్లో లోకేశ్ ముద్ర స్పష్టం

## యువతకు కీలక స్థానాల్లో పెద్దపీట

## యువగళం బృందానికి ప్రాధాన్యత

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

టిడిపి నేతలు ఎప్పటి నుచో ఎదురుచూస్తున్న పార్టీ పదవుల ప్రకటన ఎట్టకేలకు వచ్చేసింది. నామినేటెడ్ పదవులు దక్కని వారికి చెప్పినట్టుగానే పార్టీ పదవుల్లో ప్రాధాన్యత ఇచ్చారు. అయితే ఈ ఎంపిక మొత్తంలో నారా లోకేష్ ముద్ర కొట్టొచ్చినట్టు కనపడింది. నెమ్మదిగా పార్టీని ఆయన టేక్ ఓవర్ చేస్తున్న సూచనలు బలంగా కనిపించాయి. 29 మందితో పాలిట్ బ్యూరో,31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీ లు ఏర్పాటు చెయ్యగా నారా లోకేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ప్రమోట్ అయ్యారు. నారా లోకేష్ కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్గా ప్రమోషన్ రావడంతో ఇప్పటి వరకూ ఆయన నిర్వహిస్తున్న పదవులు ఆయన సన్నిహితులకే దక్కాయి. జాతీయ ప్రధాన కార్యదర్శి పదవిని ముగ్గురికి పంచారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు,ఎంపీ బైరెడ్డి శబరి, లోకేష్ కు అత్యంత సన్నిహితుడు కిలారు రాజేష్ లు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శులుగా ఎంపికయ్యారు. ఈసారి టిడిపి పదవుల ఎంపికలో సీనియర్లకు సామాజిక వర్గం ఆధారంగా పోస్టులు దక్కాయి. పోలిట్ బ్యూరో సభ్యులు గా యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జ్యోతుల నెహ్రూ, పితాని సత్యనారాయణ, వర్ల రామయ్య, నందమూరి బాలకృష్ణ వంటి వారి ఎంపిక లో ఇది కనపడింది. పార్టీలోని సీనియర్లకు జాతీయ పదవులు కేటాయించారు. అదే విధంగా ఇంతవరకు రాష్ట్ర అధికార ప్రతినిధులుగా పనిచేసిన వారికి జాతీయ అధికార ప్రతినిధులుగా ప్రమోషన్ ఇచ్చారు. ఈ కోటా లో పట్టాభి, సోమిరెడ్డి, దీపక్ రెడ్డి, నర్సిరెడ్డి లాంటి వారికి ప్రమోషన్ దక్కింది. పార్టీ జాతీయ కోశాధికారిగా కొనికళ్ళ నారాయణకు పదవినిచ్చి గౌరవించారు.

### 'యువగళం' టీమ్ కు ప్రాధాన్యత

లోకేష్ రాజకీయ చరిత్రలో గేమ్ చేంజర్ గా చెప్పుకునే "యువగళం ' యాత్ర లో కీలకం గా పనిచేసిన యంగ్ టీమ్ కు ఈసారి పార్టీ పదవుల్లో పెద్దపీట వేశారు. చాలామందికి రాష్ట్రస్థాయి పదవులు దక్కాయి. యువగళం టీమ్ లో కష్టపడిన చింతకాయల విజయ్, పాశం సునీల్ కుమార్ లకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవులు దక్కాయి. అలాగే ఎమ్మెల్యేలలో చాలామందికి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పదవులు ఇచ్చారు. వారితోపాటు కార్పొరేషన్లకు చైర్మన్ లుగా పనిచేస్తున్న వారికి కూడా ఉపాధ్యక్షులుగా రాష్ట్రస్థాయి పదవులు దక్కాయి. అలాగే పార్టీ విపక్షంలో ఉన్న టైంలో అండగా నిలబడిన వారికి స్థానికంగా ఉన్న నేతల వ్యతిరేకత ఉన్నప్పటికీ పదవులు కట్టబెట్టారు. అలాంటివారిలో కొవ్వూరు నియోజకవర్గం లో మాజీ మంత్రి జవహర్ కుమారుడు ఆశీష్ లాల్ ఒకరు. తనకు రాష్ట్ర కార్యదర్శి పదవి దక్కింది. ఈసారి పార్టీ పదవులు మొత్తం లోకేష్ టీం తో నిండిపోయిన చెప్పాలి. సీనియర్లను జాతీయస్థాయి కమిటీల్లో నియమించి గౌరవించినా గ్రౌండ్ లెవెల్ పెత్తనంతా లోకేష్ టీం కే దక్కింది. అలాగే యువకులకు ఈసారి పెద్దపీట వేయడం పార్టీలో మొదలైన నాయకత్వ మార్పుకు సంకేతంగా నిలిచింది. అలాగే కష్టకాలంలో పార్టీ కోసం కష్టపడ్డ వారికి పార్టీ అండగా నిలబడింది అనే సంకేతాన్ని క్షేత్రస్థాయిలోకి ఈ కమిటీ ల ఎంపిక ద్వారా బలంగా పంపే ప్రయత్నం చేసింది టీడీపీ. మరి దీనిపై గ్రౌండ్ లెవెల్ పార్టీ కార్యకర్తలు ఎలా స్పందిస్తారో చూడాలి.

# నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్

మొదటి పేజీ తరువాయి...

పల్లా శ్రీనివాస్ నియయితులయ్యారు. ఈ కమిటీల కూర్పులో విధేయత, కష్టపడే తత్వం, అనుభవానికి పెద్దపీట వేశారు. నామినేటెడ్ పదవులు లభించని వారికి పార్టీ పదవుల్లో ప్రాధాన్యత కల్పిస్తూ సమన్యాయం చేశామని పార్టీ అధిష్టానం పేర్కొంది. 2029 ఎన్నికలే లక్ష్యంగా సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను బేరీజు వేస్తూ ఈ కమిటీలను రూపొందించారు. 29 మందితో పొలిట్ బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. గతానికి భిన్నంగా రాష్ట్ర కమిటీలోని 185 మందిలో 122 మందిని బడుగు బలహీన వర్గాల నుండి ఎంపిక చేశారు. ఇందులో బీసీలకు 77, ఎస్సీలకు 25, ఎస్టీలకు 7, మైనార్టీలకు 13 స్థానాలు కేటాయించి బీసీలకు 40 శాతం ప్రాధాన్యత కల్పించారు.

# నేటి నుంచి జనగణన

మొదటి పేజీ తరువాయి...

పెట్టొద్దని తేల్చిచెప్పారు. సెన్సస్ సమాచారం ప్రభుత్వ పథకాలకి కీలక ఆధారమని నివాస్ చెప్పారు. సెన్సస్‌కు అడ్డంకులు కల్పిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రణాళికలకు సెన్సస్ ప్రామాణికం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 8వ సెన్సస్ ఇది. జనాభా గణన ఫిబ్రవరిలో జరుగుతుంది. ఈలోగా ఇంటి లెక్కలు పూర్తవుతాయి. సెన్సస్ ప్రక్రియకు ప్రజలు పూర్తిగా సహకరించాలి. ఇంటి నంబర్ల నమోదు ప్రక్రియకు ఎలాంటి అడ్డంకులు పెట్టవద్దు. సెన్సస్ సమాచారమే ప్రభుత్వ పథకాలకు కీలక ఆధారం. సెన్సస్‌కు అడ్డంకులు కల్పిస్తే క్రిమినల్ చర్యలు తప్పవు" అని సెన్సస్ అధికారి జె.నివాస్ వెల్లడించారు. ప్రజలంతా భాగస్వాములు కావాలి: జనగణన 2027 తొలిదశలో భాగంగా ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు స్వీయ గణన జరుగుతుందని ఇందులో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు డాక్టరు లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు. జనగణనలో తొలిసారిగా ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. హ్ట్ట్జూం://ఒవ.ఎవఅంబం.గ్రశీజ.ఱఅ పోర్టల్ ద్వారా ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని చెప్పారు. దీనివల్ల సమయం ఆదాతో పాటు దోష రహితంగా కచ్చితమైన డేటా లభిస్తుందని వివరించారు. 34 అంశాలను ఈ గణన ద్వారా ప్రజలు తమ వివరాలను తెలియజేయాల్సి ఉంటుందని కలెక్టరు అన్నారు. స్వీయ గణనపై ప్రచార కార్యక్రమం నిర్వహిస్తామని 16వ తేదీన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ, ఎంపీపీలు, ఛైర్‌పర్సన్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలను స్వీయ గణనలో భాగస్వామ్యం చేస్తామని వెల్లడించారు. అలాగే 17వ తేదీన సచివాలయ సిబ్బంది, హెచ్‌వోడీ కార్యాలయాల సిబ్బంది, జిల్లా కార్యాలయాల సిబ్బంది, మండల కార్యాలయాల సిబ్బంది తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇలా ఏప్రిల్ 30వ తేదీ వరకు వివిధ వర్గాల ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.



# ఇంటర్ ఉత్తీర్ణతలో రికార్డు

## సెకండ్ ఇయర్‌లో 81 శాతం పాస్

## 12 ఏళ్ల తర్వాత రికార్డు ఉత్తర్ణత

## ఫస్టియర్ లో 77 శాతం పాస్

(అమరావతి - జయజయహే)

ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ ఫలితాలు 2026 బుధవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎక్స్ వేదికగా విడుదల చేశారు. తాజా ఫలితాల్లో ఇంటర్ విద్యార్థులు గరిష్ఠ స్థాయిలో ఉత్తీర్ణత సాధించడం విశేషం. గత 12 ఏళ్ల చరిత్రలో కనీవినని రీతిలో ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 4,71,864 మంది పరీక్షలు రాయగా.. అందులో 3,61,526 మంది ఉత్తీర్ణత సాధించారు. అంటే 77 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక సెకండ్ ఇయర్‌లో 4,46,537 మంది పరీక్షలు రాయగా.. అందులో 3,59,816 మంది ఉత్తీర్ణత సాధించారు. అంటే ఏకంగా 81 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వొకేషన్‌లో ఫస్ట్ ఇయర్‌లో 61 శాతం, సెకండ్ ఇయర్‌లో 74 శాతం నమోదైంది. ఇక ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, మోడల్, సోషల్ వెల్ఫేర్ కాలేజీలు కూడా ఫలితాల్లో సత్తా చాటాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌కు ప్రభుత్వ కాలేజీల్లో 54 శాతం, మోడల్ స్కూళ్లలో 75 శాతం, సోషల్ వెల్ఫేర్ హాస్టల్లలో గరిష్ఠంగా 87 శాతం, కేజీబీవీల్లో 84 శాతం, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్లలో90 శాతం, బీసీ వెల్ఫేర్‌లో 97 శాతం, ఏపీఆర్జేసీ కాలేజీల్లో 92 శాతం చొప్పున ఉత్తీర్ణత నమోదైంది.

ఇక ఎయిడెడ్ జూనియర్ కాలేజీల్లో 46 శాతం, ప్రైవేట్ ఎయిడెడ్ జూనియర్ కాలేజీల్లో 80 శాతం చొప్పున ఉత్తీర్ణత పొందారు. మొత్తంగా 77 శాతం ఉత్తీర్ణత వచ్చింది. ఇక సెకండ్ ఇయర్‌లో అన్ని కాలేజీల్లో కలిపి 81 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కాగా ఈ ఏడాది ఫస్ట్, సెకండ్ ఇయర్‌కు కలిపి 10.50 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

# చంద్రబాబు తాత తరం కూడా కాదు

మొదటి పేజీ తరువాయి...

హార్బర్ పనులు పూర్తి చేసి ఎన్నికల ముందు ప్రారంభించాం. ఎన్నికల తరువాత ప్రధాని నరేంద్రమోదీ సైతం వర్చువల్ గా ఈ హార్బర్ ను ప్రారంభించారని జగన్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారులకు ఏనాడూ మంచి చేసే ఆలోచన చేయలేదు. చంద్రబాబు ఎలాగూ చెయ్యలేదు.. కనీసం జగన్ చేసిన వాటిని అయినా వాళ్లకి దక్కకుండా చేస్తున్నాడు. ప్రధాని జాతికి అంకితం చేసి ఏడాదిన్నర అయింది. మత్స్యకారులకు ఎందుకు హ్యాండోవర్ చేయలేదని జగన్ ప్రశ్నించారు. ఈ హార్బర్ ను నమ్ముకుని 25వేల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. ఈ హార్బర్ లో 1255 బోట్లు నిలిపేలా నిర్మాణం చేశాం. అవికూడా ప్రభుత్వం ఇవ్వాలని మా హయాంలో నిర్ణయం తీసుకున్నాం.వైసీపీ అధికారంలోకి వచ్చి ఉంటే ఈపాటికి ఇక్కడ మత్స్యకారులకు బోట్లు అందేవి. హార్బర్ కన్నులపండుగగా నడిచేది. మత్స్యకారులు సంతోషంగా ఉండేవారని జగన్ అన్నారు. అలాంటి హార్బర్ ను చంద్రబాబు ప్రైవేట్ డిఫెన్స్ ఫ్యాక్టరీకి భూములు కేటాయించారు. అంతకీ ప్రైవేట్ కంపెనీకి ఇవ్వాలంటే కృష్ణపట్నం పోర్టు దగ్గర ఇచ్చుకో అంటూ జగన్ చంద్రబాబుకు సూచించారు. ఒకవేళ ఎవరికైనా ఇచ్చినా మా ప్రభుత్వం వచ్చాక తిరిగి తీసుకుంటాం. హార్బర్లు మత్స్యకారుల సొత్తు. చంద్రబాబు కాదుకదా ఆయన తాత వచ్చిన ఎవరు ఆపలేరు. రాష్ట్రంలో హార్బర్లు అన్ని మత్స్యకారుల సంపదేనని జగన్ అన్నారు. బీదా సోదరులు మత్స్యకారులను బెదిరించి వెనక్కి ఇచ్చేశారు. కొందరు మత్స్యకారులకు డబ్బులిచ్చి దొంగతనం చేశారు. ఇంత వరకూ ఒక్కరిని కూడా అరెస్టు ఎందుకు చేయలేదని జగన్ ప్రశ్నించారు. కొందరు పోలీసులను బదిలీ చేసి వదిలేశారు. సీఎం కొడుకు మార్చి 12న వచ్చి దొంగతనం చేసుకోండి అని ఆశీస్సులు ఇచ్చాడు. మార్చి 16న బోట్లు దొంగతనం చేశారు. ఎల్లకాలం ఇదే ప్రభుత్వం కొనసాగదు.. ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారు అంటూ జగన్ హెచ్చరించారు.

# అమరావతి పేరు ఇలా రాయాలి

మొదటి పేజీ తరువాయి...

అస్పష్టతను తొలగించి, అన్ని రికార్డులలో ఏకరూపతను పాటించేందుకు ఈ ఆదేశాలు వచ్చాయి. ప్రభుత్వ ఉత్తర్వులు, లేఖలు, నివేదికలు, డిజిటల్ రికార్డులలో అమరావతి స్పెల్లింగ్‌లో h ఉండకూడదని, అలాగే ti స్థానంలో thi వాడకూడదని స్పష్టమైన సూచనలు ఇవ్వబడ్డాయి. ఈ నిర్ణయం ద్వారా అధికారిక వ్యవహారాల్లో అమరావతి పేరుకు సంబంధించి ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# ఆందోళన అనవసరం

మొదటి పేజీ తరువాయి...

నిర్మలా సీతారామన్ స్పందించారు. డీలిమిటేషన్ కమిషన్ ప్రతి రాజకీయ పార్టీని సంప్రదిస్తుందని స్పష్టం చేశారు. బంగాల్‌లోని పూర్బ బర్ధమాన్‌లో పర్యటించిన ఆమె, ఈ మేరకు ప్రముఖ వార్త సంస్థ ఏఎన్ఐతో మాట్లాడారు. డీలిమిటేషన్ విభజిస్తుందన్న బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యలపై నిర్మలా సీతారామన్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఆమె మహిళలకు రిజర్వేషన్లను ఆపి, బంగాల్ ప్రజల మనసుల్లో భయాన్ని నింపడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. "లోక్‌సభలో సీట్లను 850కి పెంపు అనేది ఒక గరిష్ట పరిమితి. ప్రతి రాష్ట్రానికి ఒక డీలిమిటేషన్ కమిటీ ఉంటుంది. అది అన్ని పార్టీలతో మాట్లాడిన తర్వాతే ఒక నిర్ణయం తీసుకుంటుంది. మరి భయం ఎందుకు? మీకు ఎస్ఐఆర్ అంటే భయమా? ఎన్నికల సంఘం, పార్లమెంట్ ఆమోదించిన ప్రతి చట్టం గురించి మీకు భయం. కానీ ఇక్కడ మీరేమీ చేయరు" అని నిర్మలా సీతారామన్ అన్నారు.ఇదిలా ఉండగా, పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ల చట్టానికి సంబంధించిన వ్యూహాన్ని చర్చించేందుకు కాంగ్రెస్ కీలక సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీకి అగ్రనేతలు అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మహిళా రిజర్వేషన్ల అంశంతో పాటు నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కూడా చర్చించారు. కాగా, మహిళా రిజర్వేషన్ల చట్టం, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం మంగళవారం ఎంపీలకు పంపిణీ చేసింది. డీలిమిటేషన్ ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరగాలని కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి పి. చిదంబరం డిమాండ్ చేశారు. తమిళనాడు కోయంబత్తూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచాలన్న ప్రతిపాదనను ఒక భ్రమగా అభివర్ణించారు. మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ సీట్లను 850కి పెంచే రాజ్యాంగ సవరణను ఆమోదించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల సమయాన్ని ఆయన వ్యతిరేకించారు. తమిళనాడు, బంగాల్‌లో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పలువురు ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్‌కు హాజరు కాలేకపోవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం లోక్‌సభలో 543 సీట్లు ఉన్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచి అమలు చేయాలనే ఉద్దేశంతో, లోక్‌సభ సీట్ల సంఖ్యను 850కి పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో 815 సీట్లు రాష్ట్రాలకు, మిగిలిన 35 సీట్లు కేంద్రపాలిత ప్రాంతాలకు కేటాయించనున్నట్లు సమాచారం. ఏప్రిల్ 16 నుంచి జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. లోక్‌సభ సీట్ల సంఖ్యలో 50 శాతం పెరుగుదల ఉండనున్నప్పటికీ, ఈ పెరుగుదల ప్రతి రాష్ట్రానికి జనాభా నిష్పత్తి ఆధారంగా ఉండదని ప్రతిపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# డిలిమిటేషన్‌కు వైసీపీ సపోర్టు

మొదటి పేజీ తరువాయి...


విషయంలో తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి వంటి నేతలందరూ ఒకే తాటిపైకి వస్తున్నారు. జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచితే అభివృద్ధి చెందిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్నది వీరి ప్రధాన వాదన. అయితే, ఈ బలమైన దక్షిణాది వాదాన్ని పక్కన పెట్టి జగన్ మద్దతు తెలపడం వెనుక ఉన్న వ్యూహం ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది. సజ్జల రామకృష్ణారెడ్డి ద్వారా వెలువడిన ఈ ప్రకటన, బీజేపీ సత్సంబంధాలను కొనసాగించాలనే వైఎస్సార్సీపీ విధానానికి అద్దం పడుతోంది. రాజకీయంగా చూస్తే, ఈ అంశం చంద్రబాబు నాయుడును ఇరుకున పెట్టడానికి జగన్‌కు ఒక గొప్ప అస్త్రం. ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు, ఒకవేళ కేంద్రం దక్షిణాదికి అన్యాయం చేస్తుందని భావిస్తే.. ఆయన కేంద్రాన్ని గట్టిగా నిలదీయలేరు ,ఒప్పించలేరు .చంద్రబాబు ఆధ్వర్యంలోనే అన్యాయం జరిగిందని ఆయనను టార్గెట్ చేస్తూ జగన్ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చు. దక్షిణాది ఆత్మగౌరవం అనే నినాదాన్ని ఎత్తుకుని చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉన్నప్పటికీ, జగన్ ఆ మార్గాన్ని ఎంచుకోలేదు. బదులుగా, సీట్ల పెంపు వల్ల కార్యకర్తలకు మరిన్ని అవకాశాలు వస్తాయని, మహిళా రిజర్వేషన్లకు ఇది మార్గం సుగమం చేస్తుందని జగన్ వాదిస్తున్నారు.

# 23న రాంబిల్లి సెజ్‌కు చంద్రబాబు

## రెన్యూ సోలార్ పరిశ్రమకు శంకుస్థాపన

(అనకాపల్లి - జయజయహే)

ఈ నెల 23న జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో రాంబిల్లి సెజ్‌లో నిర్వహించనున్న రెన్యూ ఫోటో వోల్టాయిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ భూమి పూజ కార్యక్రమానికి సంబంధించి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అందుకుగాను పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా తో కలిసి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సుమారు 10 నుంచి 20 వేల మంది ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తూ, అందుకు తగిన విధంగా పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సభావేదిక స్టేజీ ఏర్పాట్లు, వి ఐ పి, వి వి ఐ పి గ్యాలరీ, డెకరేషన్ తదితర ఏర్పాట్లు నిర్దేశిత సమయం లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



రాంబిల్లి మండలం గజిరెడ్డిపాలెం సమీపంలో 10 ఎకరాల్లో సభా ప్రాంగణ ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. 15 ఎకరాల విస్తీర్ణంలో పబ్లిక్ పార్కింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పార్కింగ్ ప్రదేశంలో ఎల్.ఈ.డి స్క్రీన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి గ్యాలరీలో 500 మంది కూర్చునే విధంగా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్యాలరీకి ఒక ఎంఆర్‌వోను ఇన్‌చార్జ్‌గా నియమించి, కూర్చునే ఏర్పాట్లు, తాగునీరు, ఇతర అవసరాలను సమర్థంగా పర్యవేక్షించాలని తెలిపారు.

ప్రజలను తరలించేందుకు సుమారు 200 బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి బస్సులో ఉదయం 7 గంటల లోపు తాగునీరు, ఆహారం అందుబాటులో ఉండేలా బస్ ఇన్‌చార్జ్‌లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సభా ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో ట్రాఫిక్‌ను సమర్థంగా నియంత్రించాలని సూచించారు. అదేవిధంగా, వీఐపీ భద్రతకు ప్రత్యేక బందోబస్తు, క్యూలైన్ నిర్వహణ చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులలో స్పందించేందుకు క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సభా ప్రాంగణంలో తగినన్ని తాగునీరు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. తగినన్ని మెడికల్ క్యాంపులు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని వైద్యశాఖను ఆదేశించారు. సభ జరుగనున్న ప్రాంగణం, రహదారులు పూర్తిగా శుభ్రపరచి, శానిటేషన్ పనులు సమగ్రంగా నిర్వహించాలని , తగినన్ని టాయిలెట్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రజలకు సులభంగా చేరుకునేందుకు మార్గదర్శక సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.



# విద్యార్థుల భద్రతే లక్ష్యం


## ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:

నగరంలోని మోరంపూడి పాఠశాలకు 10వ తరగతి అనుమతి లభించిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. రూ.25 లక్షల సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. స్థానికంగా 10వ తరగతి అందుబాటులోకి రావడంతో విద్యార్థులు హైవే దాటే ప్రమాదం తగ్గుతుందని పేర్కొన్నారు. అలాగే పాఠశాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తూ, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

# వైస్సార్సీపీ పార్లమెంట్ స్టేట్ సెక్రటరీగా మేడపాటి

రాజమహేంద్రవరం, జయ జయహే ప్రతినిధి



వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకురాలు, మాజీ ఏపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్పర్సన్, మాజీ రుడా చైర్పర్సన్ మేడపాటి షర్మిళ రెడ్డి ని పార్టీ పార్లమెంట్ స్టేట్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె నియామకంపై పార్టీ కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ పట్ల ఆమె కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించడంపై వారు సంతోషం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఈ నియామకానికి కారణమైన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి, పార్టీ నాయకులకు షర్మిల రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు మరింత కృషి చేస్తానని మేడపాటి షర్మిళ రెడ్డి అన్నారు.

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసేందుకు కృషి .. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు



టెక్కలి ఏప్రిల్ 15 జయ జయహే

ప్రజా సంక్షేమానికి సత్వర అభివృద్ధి సాధనకు కూటమి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు స్పష్టం చేశారు.

టెక్కలి పట్టణ కేంద్రంలోని పట్టు మహాదేవి కోనేరు వద్ద నిర్మించిన అన్న క్యాంటీన్ ఆయన ప్రజలకు అంకితం చేశారు, జిల్లాలోని పెండింగ్ లో ఉన్న ప్రతి ప్రాజెక్ట్ సత్వరమే పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు, ప్రజా శ్రేయస్సు కొరకు అన్ని విధాల కృషి జరుగుతుందన్నారు, అన్నా క్యాంటీన్ ద్వారా పేదలకు రుచికరమైన భోజనాలు కేవలం ఐదు రూపాయలకే కూ టమి ప్రభుత్వం అందిస్తుందన్నారు , ఈ అన్నా క్యాంటీన్ ద్వారా పేదలు, కర్షక ,కార్మికులు అందరికీ చక్కని భోజనం అందజేసి ఆకలిని తీరుస్తున్నామని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి అచ్చన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఆర్ డి ఓ ఎం కృష్ణమూర్తి, టెక్కలి తెదేపా అధ్యక్షుడు బగాది శేషగిరిరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పినకాన అజయ్ కుమార్, లవ కుమార్, బమ్మిడి శేషగిరి, సత్తారు మల్లేశ్వరరావు, మనోజ్, అధికారులు అనధికారులు పాల్గొన్నారు.

# పీఎం సూర్యఘర్ పథకంతో పేదల ఇళ్లలో ఉచిత విద్యుత్ వెలుగులు

నిడదవోలు జయ జయహే ప్రతినిధి:

నిడదవోలు మండలం గోపవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో "ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన" పథకాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పథక ప్రచారార్థం "సూర్యాంధ్ర ప్రగతి రథాలను" పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారుని ఇంటికి వెళ్లి సోలార్ మీటర్‌ను స్వయంగా ఆన్ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, పీఎం సూర్యఘర్ పథకం పేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పు తీసుకువస్తుందని తెలిపారు. సూర్యశక్తిని వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేసి ప్రజలకు అందించడం ద్వారా విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.1.25 లక్షల వరకు పూర్తి ఉచితంగా సోలార్ కనెక్షన్ అందిస్తున్నామని, ఇతర వర్గాలకు రూ.78,000 సబ్సిడీ అందిస్తామని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి నెల సుమారు రూ.2,400 వరకు ఆదా అవుతుందని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లభిస్తుందని వివరించారు. నిడదవోలు




నియోజకవర్గంలో మొత్తం 3,119 సోలార్ కనెక్షన్లు ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గోపవరం గ్రామంలో 189 ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో 159 కుటుంబాలు ఇప్పటికే పథకానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు.

### గోపవరం అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు

గోపవరం గ్రామ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.2.67 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. పల్లెపండుగ పథకాల ద్వారా లక్షల రూపాయల పనులు చేపట్టడంతో పాటు జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ శుద్ధి చేసిన గోదావరి నీటిని అందిస్తున్నామన్నారు.

డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్, శాస్కి నిధుల ద్వారా పలు



అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. రోడ్లు, డ్రైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, దేవాలయ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. నిడదవోలు నియోజకవర్గానికి రూ.28 కోట్ల శాస్కి నిధులు తీసుకువచ్చినట్లు తెలిపారు.

### ప్రజా సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం ముందంజ

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ప్రజలకు అందుతున్నాయని పేర్కొన్నారు



# వసతి గృహా విద్యార్థులకు యూనియన్ బ్యాంక్ ఫ్యాన్లు వితరణ

## బి టి ఏ అభ్యర్థనతో విద్యార్థుల కల నెరవేరింది

టెక్కలి ఏప్రిల్ 15 జయ జయహే

పేద విద్యార్థుల మౌలిక సదుపాయాలను కల్పించి అవసరాలకు ఆదుకున్న వారే దేవుళ్ళు వేసవి తాపానికి సరైన సమయంలో తామంతా సంతోషంగా చదువుకునేందుకు అవసరమైన వెలుగులు, చల్లని గాలులు అందించిన యూనియన్ బ్యాంక్ ఇతర పెద్దలు వితరణకు పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు, బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కోలక కృష్ణమోహన్ అభ్యర్థన మేరకు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఎస్సీ వసతి గృహం భీమ్ భవన్ వసతి గృహం విద్యార్థులకు 15 ఫ్యాన్లు, ట్యూబ్లైట్లను యూనియన్ బ్యాంక్ యాజమాన్యం మంజూరు చేయడంతో, విద్యార్థులు తల్లిదండ్రులు పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారతరత్న డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా యూనియన్ బ్యాంక్ సుమారు 30 వేలకు పైగా వ్యయంతో విద్యార్థులు చదువుతున్న ప్రతి గదులకు ఈ ఫ్యాన్లను అమర్చి సంతోషంతో చదువులు కొనసాగించేందుకు వారు చేసిన మేలు మరువలేమని బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ వితరణ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ శ్రీకాకుళం రీజనల్ ప్రధాన అధికారి పైడి రాజా, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా వసతి గృహం అధికారి రాము కు అందజేసారు, విద్యార్థులు ప్రతి ఒక్కరు బాధ్యతగా చదివి ప్రయోజకులుగా క్రమశిక్షణతో చదివి ఉన్నత ఆశయాలను సాధించాలని వితరణ కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ ఈ టి ఐ మేనేజర్ రాంజీ, ఏ ఐ బి ఓ సి రీజనల్ సెక్రటరీ తేజేశ్వరరావు, బ్యాంకర్స్ ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రీజినల్ సెక్రెటరీ మజ్జి రాజశేఖర్, అసోసియేషన్ ప్రతినిధులు ధనరాజు, రాజేంద్రప్రసాద్, అనిల్ సూర్య కిరణ్, బి టి ఏ జిల్లా శాఖ అధ్యక్షులు సీర రమేష్ బాబు, విద్యార్థులు పెద్దలు, పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

## కార్మికుల చట్టాలను పునరుద్ధరించాలి

టెక్కలి ఏప్రిల్ 15 జయ జయహే

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను తక్షణమే రద్దు చేసి కార్మిక సంక్షేమశీ కోసం దారి మళ్లించిన నిధులను కార్మిక సంక్షేమానికి ఉపయోగించి కార్మిక చట్టాలను పరిరక్షించాలని జిల్లా సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర సిఐటియు మహాసభలో ఈనెల 15, 16, 17న, జరుగుతున్న సందర్భంగా టెక్కలి మండలంలోని తొలిసూరుపల్లి సిఐటియు కార్యాలయం వద్ద కార్మికులతో జెండా ఆవిష్కరణ సమావేశం నిర్వహించారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని వదిలి పెట్టి కార్పొరేట్ కంపెనీల సేవలో మునుగుతున్నారని దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశమంత ఎత్తున పెరుగుతున్నాయని, మరోవైపు అవినీతి అక్రమాలు, పేద వర్గాలపై దాడులకు పాలకవర్గాలు ప్రోత్సహిస్తున్నాయని ఆయన అన్నారు. కార్మికుల ఆకలని తీర్చే సంక్షేమ పథకాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడాలని సూచించారు, కార్మికుల హక్కులు కాల రాస్తే కార్మికులంతా ఐక్యమత్యంతో పోరాటానికి సిద్ధం కావాలని షణ్ముఖరావు పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో యండ నారాయణరావు, చిన్నారావు, ప్రభా మేస్త్రి, చింతాడ అప్పన్న, బుజ్జి, సత్తారు ఉత్తర, చిరంజీవి, లచ్చయ్య పలువురు పాల్గొన్నారు.

# టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎంపీ సానా

## క్యాడర్ టు లీడర్ టిడిపిలోనే సాధ్యం సానా

అమరావతి, (జయ జయహే)



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబును పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా సానా సతీష్ బాబు, పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీపొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించగా, మొత్తం 18 మంది సభ్యులతో కూడిన జాతీయ ఉపాధ్యక్షుల బృందంలో సానా సతీష్ బాబుకు స్థానం కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,"క్యాడర్ నుంచి లీడర్‌గా ఎదగడానికి అవకాశం తెలుగుదేశం పార్టీలోనే ఉంది. కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీ తప్పకుండా గుర్తింపు ఇస్తుంది" అని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, ప్రజలకు మరియు పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు.



# వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

**మాడుగుల ఏప్రిల్ 15 జయ జయ హే**

మాడుగుల మండలంలో కోట్లాది రూపాయలతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి బుధవారం ప్రారంభించారు. దానిలో భాగంగా సుమారు 38 లక్షల రూపాయలతో నిర్మించిన మాడుగుల హై స్కూల్ ప్రహరీ గోడను ఆయన ప్రారంభించారు. అలాగే 60 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను, సుమారు 25 లక్షల రూపాయలతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్ర భవనాన్ని, మరో 10 లక్షల రూపాయలతో నిర్మించిన మరో సిసి రోడ్డును ప్రారంభించిన ఆయన, 50 లక్షల రూపాయలతో నిర్మించి తలపెట్టిన పాండవుల చెరువుగట్టు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే ఎం కే వల్లాపురం, ఏం కోటపాడు, కేజే పురం, వంటర్లపాలెం, ముకుందపురం గ్రామాలలో నిర్మించిన సిసి రోడ్లను ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పి అప్పలరాజు, ఎంపీపీ టీవీ రాజారామ్, జడ్పిటిసి కె రమణమ్మ, పెద్దేరు ఆయకట్టు ప్రాజెక్ట్ చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎన్ సన్యాసిరావు, పి రమేష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు పి లక్ష్మీనారాయణ, క్లస్టర్ ఇంచార్జి బి విజయలక్ష్మి, బిజెపి జనసేన నాయకులు పుట్ట గంగయ్య,ఏం సంతోష సుబ్బలక్ష్మి, మెల్లిపాక స్వామి, ఏం సతీష్, జి శివాజీ, రబ్బ మహేష్ కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.





# పంచాయతీ కార్యాలయం వద్ద ఓటర్ల జాబితా ప్రచురణ

**చోడవరం ఏప్రిల్ 15 జయ జయహే**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు బుధవారం చోడవరం మండలంలో గల 32 గ్రామ పంచాయతీ లలో గ్రామ పంచాయతీ ఓటర్లు జాబితా, వార్డుల డివిజన్ వివరాలు ప్రచురించారు. సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు(పంచాయతీ డెవలప్మెంట్ అధికారులు) ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కాబట్టి ఆయా గ్రామాల్లో గల వాటర్ లో ఈ జాబితాను పరిశీలించుకోవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

# దేశానికి దిశ చూపేలా బిల్లులపై చర్చించాలి




చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై పలు విమర్శలు వస్తున్నాయి. పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయ పార్టీలతో పాటు, పౌరసమాజంలోనూ అనుమానాలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి పార్లమెంట్ మూడు రోజుల పాటు ప్రత్యేకంగా సమావేశం కాబోతున్నది. అందువల్ల ఈ విషయంలో అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉంది. అనుమానాలు వ్యక్తం చేస్తున్న వారు, ఆందోళనలు చేస్తున్న వారు, విమర్శలు చేస్తున్న వారి అభిప్రాయాలకు విలువనివ్వాలి. పార్లమెంట్ వేదికగా సుదీర్ఘంగా చర్చించాలి. విపక్ష, స్వపక్ష నేతలు కూడా పరస్పర వివాదాల జోలికి పోకుండా ప్రజలకు అర్థమయ్యేలా సమగ్రంగా చర్చించాలి. అఖిలపక్ష సమావేశం కన్నా పార్లమెంటులో చర్చించడమే మేలు. ఎందుకంటే ఈ చర్చకు చట్టబద్దత ఉంటుంది. అలాగే సభ్యుల సూచనలు, సలహాలకు విలువ ఉంటుంది. ఎఐ వినియోగం, సాంకేతికత పెరిగిన ప్రస్తుత కాలంలో ఈ విషయాలపై వాటి సాయం కూడా పొందితే మంచిది. పార్టమెంటులో సుదీర్గ ఉపన్యాసాలకు తావులేకుండా, పరస్పర విమర్శలకు చోటు లేకుండా ఈ రెండు అంశాలపై సమగ్రంగా చర్చించాలి. దీనివల్ల ప్రజలకు కూడా అవగాహ కలిగేలా ఉండాలి. రాజకీయపార్టీలు స్వార్ధ రాజకీయాలను పక్కన పెట్టి, ఈ అంశాలపై ఓ ఏకాభిప్రాయం వచ్చేలా చూడాలి. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ బిల్లు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది. నిజానికి మొన్నటి సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్లమెంట్ ముందుకు వచ్చింది. అప్పుడే ఇది చట్టంగా మారివుంటే బాగుండేది. కొత్తగా జనాభా లెక్కల తరవాత దీనిని అమలు చేస్తామని గతంలో బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం అమలు చేస్తే అన్యాయం చేసినట్లు అవుతుంది. 2029లో సార్వత్రిక ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యం మరింతగా వికసిస్తుందని, బలోపేతం అవుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. విధాన నిర్ణయాల్లో మహిళలు ఎప్పుడైతే క్రియాశీలంగా వ్యవహరిస్తారో అప్పుడు వికసిత్ భారత్ దిశగా ప్రయాణం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్న నేపథ్యంలో దేశంలోని మహిళలకు ప్రధాని ప్రత్యేకంగా లేఖ రాశారు. నిజానికి ఇప్పటికే మహిళల రిజర్వేషన్లు అమలు జరిగివుండాల్సింది. అనేక రంగాల్లో మహిళలు రాణిస్తున్నందున చట్టసభల్లోనూ వారి భాగస్వామ్యం



పెరగాల్సిందే. చట్టసభల్లో వారి వాణి బలంగా వినిపిస్తే ప్రజాసామ్యం మరింత బలోపేతం అవుతుంది. అయితే లోక్‌సభ సీట్లు పెరిగితేనే మహిళల రిజర్వేషన్లు అమలు సులువవుతందని ప్రభుత్వ వాదనగా ఉంది. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య 550ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2027 జనాభా లెక్కల నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ అందుకు సంబంధించి లెక్కలు వెలువడటానికి ఆలస్యమవుతుందన్న ఉద్దేశంతోనే ముందస్తు గా ఈ రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకొస్తున్నట్లు కేంద ప్రభుత్వం పేర్కొంది. దాని ప్రకారం వెళ్తే ప్రజాస్వామ్య పక్రియలో మహిళా భాగస్వామ్యం పెంచడంలో జాప్యం జరుగుతుందని అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం ఏ జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనేదీ ఈ బిల్లులో చెప్పలేదు. అయితే డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన బిల్లులో ఆ కమిషన్ ఏర్పాటయ్యే నాటికి అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాలను పునర్విభజించనున్నట్లు పేర్కొంది. అంటే దాని ప్రకారం ప్రస్తుతం అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కలు 2011వే కాబట్టి వాటి ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశముంది. 850 సీట్లను ఏ ప్రాతిపదికన పెంచబోయేదీ ఈ బిల్లులో స్పష్టత ఇవ్వకున్నా పార్లమెంటులో చర్చ సందర్భంగా ప్రభుత్వం చెప్పే అవకాశం ఉంది. అప్పుడు అన్ని రాష్ట్రాల్లో స్థానాలను 50శాతం పెంచుతామని చెబితే ఏయే రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు ఎన్ని పెరుగుతాయన్న దానిపై స్పష్టత వస్తుంది. ఆ రాష్ట్రాలకు వచ్చిన సీట్లను అంతర్గతంగా పునర్విభజించుకోవడానికి 2011 జనాభా లెక్కలు పనికొస్తాయి. అలా కాకుండా దేశం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకొని 2011 జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన చేపట్టాలని నిర్ణయిస్తే డీలిమిటేషన్ కమిషన్ అంతిమంగా నివేదిక ఇచ్చేంత వరకూ ఏ రాష్ట్రం లో ఎన్ని సీట్లు పెరుగుతాయన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కమిషన్‌కు సహాయ పడటానికి ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని నియమిస్తారు. ఇందులో ఐదుగురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యేలుంటారు. లోక్‌సభ సభ్యులను లోక్‌సభ స్పీకర్, ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేస్తారు. నియోజకవర్గాల పునర్విభజన కోసం రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్, సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా, వారి నామినీలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను, భౌగోళిక పరిస్థితులపై అవగాహన ఉన్న నిపుణులను, ఇతరత్రా అవసరమైన వారిని పిలిచి మాట్లాడే అధికారం ఈ కమిషన్‌కు ఉంటుంది. కమిషన్ సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడితే మెజారిటీ సభ్యుల అభిప్రాయం చెల్లుబాటవుతుంది. డీలిమిటేషన్ బిల్లులో ఈ కమిషన్ ఏర్పాటు కావడానికి ముందు అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజక వర్గాల పునర్విభజన జరుగుతుందని చెప్పింది తప్పితే స్పష్టంగా ఫలానా జనాభా లెక్కల ప్రాతిపదికన అని చెప్పలేదు. 2027 జనాభా లెక్కల సేకరణ జరుగుతున్న తరుణంలో 2011 జనాభా లెక్కలను ఎలా ప్రాతిపదికగా తీసుకుంటారని ప్రతిపక్షాలు ప్రశ్నించే వీలుండటంతో ఆ దాడి నుంచి తప్పించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తెలివిగా కమిషన్ ఏర్పాటయ్యే నాటికి ముందున్న జనాభా లెక్కల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పినట్లు కనిపిస్తోంది. అయితే ఇవన్నీ ఓక పజిల్‌లలాగా కనిపిస్తున్నాయి. అందువల్ల పార్లమెంట్ చర్చకు విలువ ఉంటుంది. అఖిలపక్షం కన్నా పార్లమెంటులో చేస చర్చలకే ప్రాధాన్యం ఉంటుంది. విపక్షాలకు ఉన్న అనుమానాలను తీర్చాల్సిన బాధ్యత అధికార పక్షానిది. అనుమానాలను సహేతుకంగా ప్రస్తావించడం ద్వారా విపక్షాలు తమవంతుగా కృషి చేయాలి. అప్పుడే ఈ రెండు బిల్లులపై సమగ్ర చర్చకు అవకాశం ఉంటుంది.

# డేటా భద్రతలో కొత్త మైలురాయి

## కాన్ఫిడెన్షియల్ కంప్యూటింగ్ విధానం

**(సి.హెచ్. ప్రతాప్)**

ప్రస్తుత డిజిటల్ యుగంలో డేటా అత్యంత విలువైన ఆస్తిగా మారింది. ప్రభుత్వాలు, పెద్ద సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ఆర్థిక వ్యవస్థలు తమ దైనందిన కార్యకలాపాలను డేటాపైనే ఆధారపడి నిర్వహిస్తున్నాయి. అయితే సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న కొద్దీ డేటా భద్రతకు సంబంధించిన సవాళ్లు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఇప్పటివరకు డేటాను రక్షించడానికి ప్రధానంగా రెండు విధానాలు ఉపయోగంలో ఉన్నాయి. ఒకటి డేటా నిల్వలో ఉన్నప్పుడు రక్షించడం; మరొకటి డేటా ఒక చోటు నుంచి మరో చోటుకు ప్రసారం అవుతున్నప్పుడు రహస్యీకరణ చేయడం. అయితే డేటా ప్రాసెసింగ్ జరుగుతున్న సమయంలో అది పూర్తిగా భద్రంగా లేకపోవడం ఒక పెద్ద లోపంగా ఉంది. ఈ సమస్యకు సమాధానంగా ఎదిగిన సాంకేతికతే కాన్ఫిడెన్షియల్ కంప్యూటింగ్.




సాధారణంగా డేటాను విశ్లేషించే సమయంలో కంప్యూటర్ వ్యవస్థలు ఆ సమాచారాన్ని తాత్కాలికంగా రహస్యీకరణ లేకుండా ఉపయోగిస్తాయి. ఈ దశలో మెమరీలో ఉన్న డేటా హ్యాకర్లు లేదా అనధికార వ్యక్తులకు సులభంగా అందుబాటులోకి వచ్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా మేఘ గణన సేవలను వినియోగించే సంస్థలకు ఇది మరింత సున్నితమైన సమస్య. ఎందుకంటే వారి డేటా ఇతరుల మౌలిక సదుపాయాలపై ప్రాసెస్ అవుతుంది. ఇక్కడే కాన్ఫిడెన్షియల్ కంప్యూటింగ్ ప్రాధాన్యం పెరుగుతుంది. ఈ విధానంలో డేటా వినియోగంలో ఉన్నప్పటికీ నిరంతరం రహస్యీకరణలోనే ఉంటుంది. అంటే ప్రాసెసింగ్ జరుగుతున్న సమయంలో కూడా ఆ సమాచారాన్ని ఎవరూ అర్థం చేసుకోలేరు.

ఈ సాంకేతికతలో ప్రధాన భావన “భద్ర ప్రాసెసింగ్ ప్రాంతాలు”. కంప్యూటర్ ప్రాసెసర్‌లో ప్రత్యేకంగా రూపొందించిన ఈ రక్షిత ప్రాంతాల్లోనే డేటా విశ్లేషణ జరుగుతుంది. ఈ ప్రాంతాన్ని ఆపరేటింగ్ సిస్టమ్ గానీ, ఇతర అనువర్తనాలు గానీ యాక్సెస్ చేయలేవు. అంతేకాకుండా క్లౌడ్ సర్వర్ నిర్వాహకులు కూడా ఆ డేటాను చూడలేరు. దీని వల్ల బాహ్య దాడుల నుంచే కాకుండా అంతర్గత ముప్పుల నుంచీ కూడా డేటాకు గట్టి రక్షణ లభిస్తుంది. అత్యంత గోప్యమైన సమాచారాన్ని సురక్షితంగా విశ్లేషించేందుకు ఇది ఒక బలమైన కవచంలా పనిచేస్తుంది.

కాన్ఫిడెన్షియల్ కంప్యూటింగ్ వల్ల సంస్థల మధ్య డేటా భాగస్వామ్యం సులభమవుతుంది. గోప్యత సమస్యల కారణంగా సంస్థలు తమ డేటాను పంచుకోవడంలో సంకోచిస్తాయి. కానీ ఈ సాంకేతికతతో డేటాను రహస్యీకరణలోనే ఉంచి ఉమ్మడిగా విశ్లేషించవచ్చు. దీనివల్ల వైద్య రంగంలో రోగుల గోప్యతను కాపాడుతూ కొత్త చికిత్సలపై పరిశోధనలు చేయవచ్చు. ఆర్థిక రంగంలో మోసాలను గుర్తించడంలో కూడా ఇది సహాయపడుతుంది. కృత్రిమ మేధస్సు అభివృద్ధిలోనూ ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సాంకేతిక సంస్థలు ఈ విధానంపై దృష్టి సారిస్తున్నాయి. భవిష్యత్తులో డిజిటల్ వ్యవస్థలు విస్తరించేకొద్దీ డేటా భద్రత మరింత కీలకంగా మారుతుంది. అటువంటి సందర్భంలో కాన్ఫిడెన్షియల్ కంప్యూటింగ్ డేటాను నిల్వలో, ప్రసారంలో మాత్రమే కాకుండా వినియోగ దశలో కూడా రక్షించే సమగ్ర పరిష్కారాన్ని అందిస్తుంది. ఇది వినియోగదారుల విశ్వాసాన్ని పెంచడమే కాకుండా భవిష్యత్తు సాంకేతిక అభివృద్ధికి బలమైన పునాది వేస్తుంది. సైబర్ భద్రతా రంగంలో ఇది నిజంగా ఒక విప్లవాత్మక ముందడుగు.




# పచ్చ యూ ట్యూబర్లను అరెస్ట్ చేయండి...!

## త్రీ టౌన్లో ఫిర్యాదు చేసిన వైసీపీ

**విశాఖపట్నం, ఏప్రిల్ 15, జయ జయహే :**

జగనన్న కుటుంబంపై విషప్రచారం చేస్తున్న తెలుగుదేశం పార్టీకి చెందిన యూట్యూబ్ చానళ్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని,ఆ చానళ్ల ద్వారా తప్పుడు సమాచారాన్ని ప్రజల్లోకి వ్యాప్తి చేస్తున్న యూట్యూబర్లపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరుతూ,శాసన మండలి సభ్యురాలు, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి,వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు మరియు విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం పరిశీలకులు పేడాడ రమణికుమారి ఇతర మహిళా నాయకులతో కలిసి 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వినతిపత్రం సమర్పించారు.అయితే, పోలీసులు ప్రారంభంలో వినతిపత్రాన్ని స్వీకరించడమే కాకుండా రిసిప్ట్ ఇవ్వడానికి కూడా నిరాకరించారు.దీంతో విశాఖపట్నం తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు , వైస్సార్సీపీ నాయకులు మరియు మహిళా నేతలు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించగా, అనంతరం పోలీసులు వినతిపత్రాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ హరి వెంకట కుమారి,మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి,రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లే అనురాధ ,మాజీ కార్పొరేటర్ పద్మారెడ్డి,శశికళ, మహిళా జనరల్ సెక్రటరీలు పద్మా రెడ్డి, పద్మావతి , దేవి విశాలాక్షి,జిల్లా అంగన్వాడి విభాగం అధ్యక్షురాలు పెనుమత్స శ్రీదేవి వర్మ, వసంత సత్యవతి, సంధ్య, పద్మజ, వెంకటలక్ష్మి తదితర మహిళా నాయకులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి పర్యటనకు నిడదవోలు సిద్ధం

## ఏర్పాట్లపై స్వయంగా పర్యవేక్షించిన మంత్రి కందుల





**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

ఏప్రిల్ 18వ తేదీ శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిడదవోలు పర్యటన ఖరారైన నేపథ్యంలో, సంబంధిత ఏర్పాట్లను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ యుద్ధప్రతిపాదికన పర్యవేక్షించారు.బుధవారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి. నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ తదితర ఉన్నతాధికారులతో కలిసి పర్యటనకు సంబంధించిన ప్రదేశాలను మంత్రి స్వయంగా పరిశీలించి, అధికారులకు అవసరమైన దిశానిర్దేశం చేశారు.ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. "స్వర్ణాంధ్ర -- స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా పట్టణ స్వచ్ఛత కార్యక్రమాలలో పాల్గొననున్నారు. గాంధీనగర్ సమీపంలోని కంటి ఆసుపత్రి వద్ద ఉన్న మాలకోడు చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే పట్టణ మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా మురుగునీటి శుద్ధి ప్లాంట్ (ఎస్టీపీ) పనులకు కూడా శ్రీకారం చుట్టనున్నారు.

ఈ సందర్భంగా సభాస్థలి, హెలీప్యాడ్ నిర్మాణ పనులను మంత్రి దుర్గేష్ పరిశీలించి, ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా సభకు హాజరయ్యే ప్రజలకు తాగునీరు, నీడ వంటి కనీస సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఎస్పీ ఆధ్వర్యంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.మూడు మండలాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలిరానున్నందున, రవాణా మరియు ట్రాఫిక్ నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. సభాస్థలి, హెలీప్యాడ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు.

నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి పర్యటన మైలురాయిగా నిలుస్తుందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొంటూ, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# చందనోత్సవానికి నకిలీ టికెట్లు తెస్తే చర్యలే..!

- ఆన్‌లైన్ టికెట్లు మాత్రమే చెల్లుబాటు
- విజయవంతానికి అంకితభావంతో పనిచేయాలి
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్
-ప్రయివేటు వాహనాలను అనుమతించం..
- ఒక పాస్ పై ఒక వాహనాన్నే అనుమతిస్తామన్న సీపీ బాగ్చీ

**విశాఖపట్నం, ఏప్రిల్ 15, జయ జయహే :**

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక చందనోత్సవ వేడుకను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన తుది విడత సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులు చేపట్టిన ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించి తగిన మార్గదర్శకాలు జారీ చేశారు. ఉత్సవ ప్రాంతాన్ని మొత్తం 12 సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్‌కు దేవస్థానం, రెవెన్యూ, పోలీస్ శాఖల నుంచి ముగ్గురు సీనియర్ అధికారులను ఇన్‌ఛార్జ్‌లుగా నియమించినట్లు తెలిపారు. వీరు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ సమన్వయంతో పని చేసి, తక్షణ నిర్ణయాలు తీసుకుంటూ పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్‌ల నిర్వహణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. కొండ దిగువన ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాల వద్ద ప్రత్యేక అధికారులను నియమించి భక్తుల రాకపోకలను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే హోల్డింగ్ ఏరియాలను వినియోగించాలని సూచించారు ఎన్నికల సమయంలో సెక్టార్ అధికారులుగా పనిచేసిన అనుభవాన్ని ఈ ఉత్సవాల్లో వినియోగించాలన్నారు. చందనోత్సవం రోజున సుమారు 2 లక్షల మంది భక్తులు విచ్చేసే అవకాశమున్నందున, ప్రతి భక్తుడు ప్రశాంతంగా స్వామివారి దర్శనం పొందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్, దేవస్థానం అధికారులు బృంద స్ఫూర్తితో పని చేయాలని సూచించారు. ప్రతి టెక్కెట్టు క్యూ.ఆర్. కోడ్ ద్వారా స్కాన్ చేయాలని, డూప్లికేట్ లేకుండా చూడాలని చెప్పారు. క్యూలైన్ల నిర్వహణ పక్కాగా ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. టికెట్లను బ్యాంకులు లేదా ఆన్లైన్ ద్వారానే కొనుగోలు చేయాలని, నకిలీవి తెచ్చినా.. కొనుగోలు చేసినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు.

**ఒక పాస్ పై.. ఒక వాహనమే అనుమతి : సీపీ**

ఒక పాస్ పై ఒక వాహనాన్నే అనుమతించేలా నిబంధనలు అమలు చేస్తామని, దీనికి అందరూ సహకరించాలని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. వి.ఐ.పి.ల జాబితాను ముందుగానే సిద్ధం చేసి వారికి నిబంధనలను స్పష్టంగా తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దర్శనానికి ఒక్క వి.ఐ.పి.తో పాటు గరిష్టంగా ఆరుగురు సభ్యులకు మాత్రమే అనుమతి ఉంటుందని, దీనికి మించి అనుమతించబోమని స్పష్టం చేశారు. పాస్ ఉన్న వాహనానికి మించి ఎవరైనా వస్తే దేవదాయ శాఖ ప్రత్యేక వాహనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయివేటు వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుని, స్పష్టమైన కమ్యూనికేషన్ ద్వారా నియంత్రణ చర్యలు అమలు చేయాలన్నారు. నిబంధనల అమలులో పోలీస్ యంత్రాంగం, దేవదాయ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో సమన్వయం వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, డీఆర్వో ఎం. విశ్వేశ్వర నాయుడు, దేవస్థానం ఈవో జె. వెంకటరావు, ఆర్డీవోలు సంగీత్ మాథుర్, శేషశైలజ, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వ అక్రమ కేసులకు భయపడం-వైసీపీ


## గుడివాడ పోరాట ఫలితమే విశాఖకు రైల్వే జోన్

**బుచ్చయ్య పేట జయ జయహే**

కూటమి ప్రభుత్వం తమపై ఎన్ని అక్రమ కేసులు బనాయించినా ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని జెడ్పిటిసి దొండా రాంబాబు తెలిపారు.బుధవారం బుచ్చయ్య పేటలో స్థానిక విలేకరులతో మాట్లాడారు.పదేళ్ల క్రితం రైల్వే జోన్ కోసం నిరాహార దీక్ష చేసిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ కి కోర్టు జైలు శిక్ష విధించడం బాధాకరమన్నారు.అప్పటి టిడిపి ప్రభుత్వం అక్రమ కేసుల వలనే న్యాయస్థానం శిక్ష విధించింది అన్నారు. గుడివాడ పోరాట ఫలితంగానే విశాఖకు రైల్వే జోన్ వచ్చిందన్నారు.ప్రజా సమస్యల పట్ల ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం అన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది అన్నారు.ప్రశ్నించే వారిని అరెస్టులు చేస్తున్నారని అన్నారు.ఉత్తరాంధ్ర అభివృద్ధి పట్ల కూటమ నాయకులకు చిత్తశుద్ధి లేదు అన్నారు. బుచ్చయ్యపేట మండల వైసీపీ శ్రేణులంతా గుడివాడ అమర్నాథ్, మాజీ సీఎం వైఎస్ జగన్ అడుగుజాడల్లో నడుస్తూ ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటాం అన్నారు.మండల వైసీపీ అధ్యక్షుడు జాగా కొండబాబు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కే అచ్చంనాయుడు, వైస్ ఎంపీపీలు డి.నారాయణమూర్తి,గొంపా చినబాబు, ఎంపీటీసీలు,తాజా మాజీ సర్పంచ్లు పాల్గొన్నారు.

# టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎర్ర వేణుగోపాల్ రాయుడు

**రాజమహేంద్రవరం జయ జయహే ప్రతినిధి:**



రాజమహేంద్రవరానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఎర్ర వేణుగోపాల్ రాయుడు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులయ్యాడు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధిష్టానం బుధవారం అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. పార్టీ పట్ల ఆయన చూపిన అంకితభావం, విశ్వాసం, మరియు దీర్ఘకాల సేవలను గుర్తిస్తూ ఈ కీలక బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.ఎర్ర వేణుగోపాల్ రాయుడు గతంలో పార్టీ బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేపట్టి, నాయకత్వ నైపుణ్యాన్ని చాటుకున్నాడు. నియోజకవర్గ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను చురుకుగా నడిపిస్తూ, శ్రేణులను సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ఆయనకు ఈ పదవి రావడం పట్ల స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా వేణుగోపాల్ రాయుడు మాట్లాడుతూ, పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని, ముఖ్యంగా యువతను పార్టీ వైపు ఆకర్షించే కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. అలాగే, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసి, భవిష్యత్తులో పార్టీ విజయాలకు తోడ్పడతానని ఆయన నమ్మకం వ్యక్తం చేశాడు. పార్టీ లక్ష్యాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ, నాయకత్వానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చాడు. ఈ నియామకం ద్వారా పార్టీ మరింత శక్తివంతంగా ముందుకు సాగుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# స్టేట్ హౌసింగ్ చైర్మన్ తాతయ్య బాబు ఉదారత

## సొంత నిధులతో స్మశాన వాటిక అభివృద్ధికి శ్రీకారం

**బుచ్చయ్యపేట జయ జయహే**

వడ్డాది గ్రామానికి చెందిన టీడీపీ నేతలు స్టేట్ హౌసింగ్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, పిఎసిఎస్ అధ్యక్షుడు దొండా నరేశ్ ఉదారత చాటుకున్నారు.తమ సొంత నిధులతో స్మశాన వాటికను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు.వడ్డాదిలోని కస్పా కాలువ అవతల ఒడ్డున అధ్వాన్నంగా ఉన్న స్మశాన వాటికలో బుధవారం జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు.వడ్డాది,కొత్తూరుకి చెందిన పలు వర్గాలు వారు ఎవరైనా మృతి చెందితే ఈ స్మశాన వాటికకే తీసుకు వెళ్లాల్సి ఉంటుంది.గత కొన్నేళ్లుగా అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ఇబ్బంది పడుతున్నారు. పుట్టెడు దుఃఖంతో పాడె మోస్తూ కాలువలోకి దిగి నీటి ప్రవాహాన్ని దాటుకుని స్మశాన వాటికకు వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు.వర్షాకాలం అయితే వీరి కష్టాలు వర్ణనాతీతంగా ఉంటాయి.వీరి ఆఖరి మజిలీ కష్టాలపై ఇటీవల కాలంలో అనేక దినపత్రికలలో వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి.దీనికి అధికారులు స్పందించకపోయినా జిల్లా టిడిపి అధ్యక్షులు,స్టేట్ హౌసింగ్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, స్థానిక పిఎసిఎస్ అధ్యక్షుడు దొండా నరేశ్ స్పందించారు.తాతయ్య బాబు తన సొంత నిధులతో స్మశాన వాటికను అభివృద్ధి చేస్తానని ప్రకటించారు.బుధవారమే సంబంధిత పనులు ప్రారంభించారు.తొలిరోజు స్మశాన వాటిక వద్ద జంగిల్ క్లియరెన్స్ చేయించారు.అదేవిధంగా తమ సొంత నిధులతో కాలువపై వంతెన నిర్మిస్తాం అన్నారు.వీలైనంత తొందరలోనే వంతెన నిర్మాణం కూడా పూర్తి చేస్తామన్నారు.పిఎసిఎస్ అధ్యక్షుడు దొండా నరేశ్ దగ్గరుండి ఈ పనులను చేపడుతున్నారు.స్మశాన వాటిక అభివృద్ధికి ముందుకు వచ్చిన తాతయ్య బాబుకి, వారి మేనల్లుడు దొండా నరేశ్ కి ఈ సందర్భంగా గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఇంటి అప్పారావు, మాజీ వార్డు సభ్యులు ఎం.సూరిబాబు,తలారి శంకర్, గురుమూర్తి, సంబంధిత కాలనీల పెద్దలు పాల్గొన్నారు.



# ఓటర్ల జాబితాపై అవగాహన సదస్సు.

**అరకులోయ: జయ జయహే.**

అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం హుకుంపేట గ్రామపంచాయతీ లో సెక్రెటరీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితాను ప్రదర్శించి ప్రజలకు అవగాహన పరచడం జరిగింది... ఓటర్లు జాబితాలో ఓటర్లు తమ తమ పేర్లను ఉన్నదో లేదో చూసుకుని తప్పులు ఉంటే సరి చేసుకోవాలని రానున్న స్థానిక సంస్థ ఎలక్షన్లలో మీ అమూల్యమైన ఓటును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట పంచాయితీ మాజీ సర్పంచ్ సమీడ వెంకట పూర్ణిమ, సెక్రటరీ సత్యనారాయణ, ఎంపీటీసీ కొమ్మరమా, మాజీ వైస్ సర్పంచ్ కోడి దాసు. గోవిందరావు, మాజీ వార్డ్ మెంబర్స్ లక్ష్మణ్, నాగబాబు, వెంకట్ పెసా కమిటీ సభ్యులు వంతల ఈశ్వరరావు, బద్నేని వీర్రాజు, హుకుంపేట మండలం వైఎస్ఆర్సిపి అధ్యక్షులు అనిల్ .తదితరులు పాల్గొన్నారు

# టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా ప్రణవ్ గోపాల్

**విశాఖపట్నం, ఏప్రిల్ 15, జయ జయహే :**



టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ నియమితులయ్యారు. విద్యార్థిగా ఉంటూ టీడీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా పని చేశారు. ఈ సమయంలో విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎం వి ప్రణవ్ గోపాల్‌ను వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ గా నియమించారు. ప్రస్తుతం రాష్ట్ర కమిటి లో చోటు కల్పించి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా నియమించటం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకంతో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకి, విశాఖ ఎం పి ఎం. శ్రీ భరత్‌కి, తూర్పు నియోజవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షులు సి హెచ్ పట్టాభిరామ్‌కి, జిల్లా ప్రజా ప్రతినిధులకు, జిల్లా నాయకత్వానికి, టీడీపీ శ్రేణులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేయటానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

For a pure tomorrow.. జయహో

# మాడుగుల సమగ్ర అభివృద్ధి లక్ష్యం

## పినగాడి..పాడేరు నాలుగు లైన్ల రోడ్డుకి గ్రీన్ సిగ్నల్.. ఎమ్మెల్యే బండారు

**మాడుగుల,ఏప్రిల్ 15,జయ జయ హే**



మాడుగుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ చెప్పారు.బుధవారం మాడుగుల సంత బయలు ఆవరణ లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గడచిన 18 నెలల కాలంలో అనేక కార్యక్రమాలు చేశామని చెప్పారు.రానున్న మూడేళ్ల కాలంలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్లి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా పినగాడి నుంచి పాడేరు వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి క్లియరెన్స్ లభించిందని చెప్పారు. అలాగే మాడుగుల డిగ్రీ కళాశాల భవనాలు కూడా త్వరలో పూర్తవుతాయని వచ్చే విద్యా సంవత్సరం నుంచి అక్కడే తరగతులు నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మాడుగుల ఎన్టీఆర్ జలాశయం పూర్తి చేసేందుకు కాలువలు నిర్మాణానికి 2 కోట్లు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారని చెప్పారు. అలాగే మైదాన ప్రాంత గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని ప్రతిపాదించడం జరిగిందన్నారు. ఆరు మాసాలలో గద్దురులేని రోడ్లను తయారు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గం లో అన్ని రోడ్లు తయారు చేశామని చెప్పారు. ముఖ్యంగా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రధాని మోడీ ఎంతో సహాయం అందిస్తున్నారని అది మన రాష్ట్ర అదృష్టమని చెప్పారు. గత ప్రభుత్వం లో దోపిడీ జరిగిందని రాష్ట్రాన్ని గాలికి వదిలి పెట్టారని మండిపడ్డారు. అన్న క్యాంటీన్ కు 400 కోట్లు రూపాయలు ఖర్చు అయితే, కేవలం రంగుల కోసం నాలుగు వేల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని జగన్ దుర్వినియోగం చేశారని విమర్శించారు. మాడుగుల పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి పట్టణ పార్టీ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ నిరంతరం కృషి చేస్తున్నారని ప్రతి సమస్య తమ దృష్టికి తీసుకు వస్తున్నారని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా మాడుగుల పట్టణ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ 24 సమస్యలతో కూడిన ఉన్నత పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఏఎంసీ చైర్మన్ పి అప్పలరాజు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. మరల అధికారంలోకి వస్తామని వైసిపి కలకంటుందని అది పగటి కలలు మాత్రమేనని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, బిజెపి నాయకులు పుట్టా గంగయ్య తదితరులు మాట్లాడారు. అలాగే కూటమి నాయకులు పి రమేష్, ఏం సంతోషి సుబ్బలక్ష్మి,ఏం సతీష్,ఏం స్వామి,ఎన్ సన్యాసిరావు, జి శివాజీ,కే త్రినాధరావు,అద్దేపల్లి జగ్గారావు,దేముడు,ఏం ఈశ్వరరావు,పి నానాజీ,కే నానాజీ,మూర్తి, ఎండిఓ కే అప్పారావు తదితరులు పాల్గొన్నారు .



# పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా పిల్లల మేధోశక్తి పెంపొందించాలి

## సూపర్వైజర్ నాగలక్ష్మి. అంగన్వాడి కార్యకర్త పవిత్ర

**డుంబ్రిగూడ:జయ జయహే**

అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలం అరకు నేరేడువలస అంగన్వాడి కేంద్రం నందు పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా సూపర్వైజర్.జె లక్ష్మి మాట్లాడుతూ 0.నుండి 6 సంవత్సరాల పిల్లల మేదో శక్తి సంపూర్ణ అభివృద్ధి అత్యంత ముఖ్యమైన అంశం ఈ వయసులో పిల్లల మెదడు వేగంగా అభివృద్ధి చెందుతుంది అందుకే సరైన పోషణ సంరక్షణ అవసరం. పాలు గుడ్లు పప్పులు కూరగాయలు పండ్లు ఇవి మెదడు అభివృద్ధికి సహాయపడతాయి తల్లిపాలు పుట్టిన వెంటనే మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లల మేదో శక్తి రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పూర్వక ఆహారం ఆరు నెలల తరువాత తల్లిపాలతో పాటు ఘన ఆహారం ఇవ్వాలి ఇది శరీరం మెదడు అభివృద్ధికి అవసరం ఆటలు నేర్పించడం పిల్లలతో మాట్లాడటం పాటలు పాడటం ఆటలు ఆడించడం వల్ల వారి మేధస్సు భాష నైపుణ్యాలు పెరుగుతాయి .ఆరోగ్య సంరక్షణ సమయానికి టీకాలు ఆరోగ్య పరీక్షలు చేయించడం చాలా ముఖ్యం పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధులు తగ్గి పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని పిల్లలకు జంక్ ఫుడ్స్ పెట్టకూడదని ఫోన్స్ ఇవ్వకూడదని నానమ్మ అమ్మమ్మలతో కథలు చెప్పించాలని గర్భిణీ బాలింత పోషణ విషయంలో భర్తలు కూడా భాగస్వామ్యం కావాలని తెలిపారు .ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త పవిత్ర .నాగలక్ష్మి సి.ఎచ్. జమున .ఆశ వర్కర్లు పిల్లల తల్లులు పాల్గొన్నారు.



# చోడవరంలో అన్న కాంటీన్ ప్రారంభం

**చోడవరం ఏప్రిల్ 15 జయ జయహే**

చోడవరం బస్టాండ్ వద్ద 61 లక్షల రూపాయలతో నిర్మించిన అన్నా క్యాంటీన్ భవనాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 1500 మందికి ఎమ్మెల్యే ఉచితంగా భోజనం వడ్డించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఐదు రూపాయలకే భోజనం అందించేలాగా ప్రజలకి ఎలాంటి ఇబ్బంది పడకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.దీని ద్వారా అనేకమంది పేద ప్రజలు ఆకలి తీరుతుందన్నారు . అలాగే మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి , ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కి , మన యువ నాయకులు ఐటీ మంత్రి నారా లోకేష్ కి, చోడవరం ప్రజలు తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గేదల సత్యనారాయణ తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ఎర్రం శెట్టి చిన్న ,మండల పార్టీ అధ్యక్షులు కనిశెట్టి మచ్చిరాజు బిజెపి పార్టీ అధ్యక్షులు కందరపు రమణమూర్తి జనసేన పార్టీ అధ్యక్షులు గూనూరు మూలినాయుడు జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రమేష్ పసుమర్తి సాంబ హాస్పటల్ చైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావు శివాలయం చైర్మన్ గూనూరు సురేష్ కూటమి పార్టీ కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు.




# ప్రారంభమైన మలేరియా నిర్మూలన మాసోత్సవాలు

**మాడుగుల, ఏప్రిల్ 15, జయ జయహే**

జిల్లా లో మలేరియా వ్యాధి నిర్మూలనలో బాగంగా మలేరియా ఉధృతి ఎక్కువగా ఉన్న 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల 145 గ్రామాలలో దోమల నియంత్రనకై ఇంటిలోపల పిచికారి కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంఈనెల 15 నుండి మే 15 వరకు జరుగుతుందనీ జిల్లా మలేరియా అధికారి వరహాలు దొర తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యాధికారి ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో దోమల సంహారిణి పిచికారి కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన చెప్పారు ఈ సందర్భంగా బుధవారం కేజేపురం, కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో చోడవరం సబ్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాడుగుల శివారు ఎం గదబూరు గ్రామంలో దోమల నివారణకు స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.గత సంవత్సర జిల్లాలో 397 మలేరియా కేసులు నమోదైన దృష్ట్యా , దోమల నియంత్రణ కై ఇంటి లోపల దోమల సంహారిణి తో పిచికారి చేసే కార్యక్రమం ప్రారంభమైందని డిఎంఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో చోడవరం సబ్ యూనిట్ అధికారి ఎస్వీ రమణ, కేజపురం పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ పాత్రుడు, హెచ్ ఎస్ వెంకట్రావు, హెచ్ఎలు నానాజీ, శ్రీనివాసరావు, శంకర్ ఆశ వర్కర్లు పాల్గొన్నారు.




# జూనియర్ ఇంటర్ ఫలితాల్లో దూసుకుపోయిన “రామబాణం”

## 104 కళాశాల ప్రాంగణంలో బాణాసంచాతో సంబరాలు

## 467/470 మార్క్స్ సాధించిన లక్ష్మిప్రియ కి అభినందనలు తెలిపిన వాసుపల్లి

**విశాఖపట్నం, ఏప్రిల్ 15, జయ జయహే :**

జూనియర్ ఇంటర్ ఫలితాల్లో రామబాణం కళాశాల విద్యార్థి ఎస్.లక్ష్మిప్రియ 470 కి 467 మార్కులు సాధించింది ఈ సందర్భంగా అకాడమీ ప్రాంగణంలో సెలబ్రేషన్స్ నిర్వహించారు. 104 బ్రాంచ్ వద్ద పండుగ వాతావరణం నెలకొంది. కళాశాల సిబ్బంది బాణాసంచా కాల్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామబాణం కళాశాలల చైర్మన్, విశాఖ దక్షిణ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ తమ అకాడమీలో చదువుకొని అత్యుత్తమ మార్కులు సాధించిన ఎస్.లక్ష్మిప్రియను అభినందించారు. తమ అకాడమీకి ఇది చాలా గర్వకారణం అని చెప్పారు. అత్యుత్తమ టీచింగ్ వ్యవస్థ తమ అకాడమీలో ఉందని పేర్కొన్నారు. అలాగే ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థిని, విద్యార్థులు చదువుపై ఏకాగ్రత పెడుతూ, క్రమశిక్షణతో మెలుగుతూ, పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ, మంచి ర్యాంకుల సాధిస్తున్నారని ప్రశంసించారు. గతంలో కూడా తమ అకాడమీ పలు పరీక్షలలో రికార్డులు సాధించిందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడమే తమ అకాడమీ లక్ష్యమని పేర్కొన్నారు. 104 ఏరియా, మద్రిపాలెం, ఆసీలమెట్ట, గాజువాక హైదరాబాద్ ప్రాంతాలలో తమ బ్రాంచ్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు కనబరుస్తున్నారని వెల్లడించారు.

# మందకృష్ణ మాదిగ వ్యాఖ్యలను ఖండించిన గాయిత్రి బ్రాహ్మణ ఐక్యవేదిక

**చోడవరం ఏప్రిల్ 15,జయ జయ హే**




బ్రాహ్మణులపై ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చేసిన వాఖ్యలను ఖండిస్తూ చోడవరం గాయత్రీ బ్రాహ్మణ ఐక్యవేదిక బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. బాపనోడు కుల, ధర్మ, దేశద్రోహి అంటూ మంద కృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలు అర్ధ రహితమని, సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ అవుతున్న బ్రాహ్మణులపై మందకృష్ణ మాదిగ విమర్శ విమర్శలను వారు ఖండించారు. బాపనోడు కి తెలిసింది ఒకటే అని, అది ఎదుటి వారి కి మంచి చేయాలనే తపన, ఆర్తి మాత్రమే అని, ఈ నైతిక ధర్మంలో తన కుటుంబాన్ని తన వాళ్లను కూడా మరిచిపోతాడన్నారు. పచ్చకామెర్ల వారికి లోకమంతా పచ్చగా కనిపించినట్టు, ద్రోహం చేసే వారికే ఎదుట పడిన వాళ్ళందరూ ద్రోహుల్లాగే కనపడతారని తెలిపారు. సకల అరిష్టాలు, విపత్కర పరిస్థితుల్లో గాలిని కూడా శత్రువుగా భావించే ఆపద సమయంలో బ్రాహ్మణులు చేసిన ధర్మం భారతదేశాన్ని కాపాడిందని, వారి ఆహార నియమాలు సనాతన సాంప్రదాయాలను సర్వమానవాళి ఆచరిస్తోందని తెలియజేశారు. నాయకులుగా ఎదిగిన వారు, ఆదర్శ భావాలతో మెలగాలే గాని విమర్శలతో నైతిక ధర్మాన్ని విడిచిపెట్టరాదని హితవు పలికారు. సమాజం చూపు అంతా బ్రాహ్మణుని పైనే ఉందని, ఇటువంటి వాఖ్యలు, చేష్టలు, సంఘటనలు బ్రాహ్మణ జాతికి ముప్పు తెచ్చేవని అన్నారు. సంఘం తరపున ఖండన, పోరాటాలు లేకపోతే, బ్రాహ్మణ జాతి అంతరించిపోయే ప్రమాదంలో పడిందని తెలిపారు. బ్రాహ్మణులు సంఘటితం అవ్వాలని కళ్ళు తెరవాలని ఉనికిని కాపాడుకునేందుకు పోరాటాలు తప్పవు అని తెలియజేశారు.



# జీవీఎంసీలో విలీనంపై సీఎందే తుదినిర్ణయం

## భీమిలి ఎమ్మెల్యే గంటా

**మధురవాడ, ఏప్రిల్ 15, జయ జయహే :**

భీమిలి నియోజక వర్గంలోని పలు మండలాలను జీవీఎంసీలో విలీనం చేసే ప్రతిపాదన సీఎం దృష్టిలో ఉందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. 6 వ వార్డులోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మూడు మండలాలకు ఒక జిల్లా పరిషత్ ఏర్పాటు సాధ్యం కాదన్నారు. ఇప్పటికే భీమిలి మండలంలో సగం జీవీఎంసీలో కలిసిందని.. ఆనందపురం మండలాన్ని జీవీఎంసీలో భాగంగానే భావిస్తారని.. దూరంగా ఉన్న పద్మనాభం మండలం కూడా భోగాపురం ఎయిర్ పోర్టు మొదలయ్యాక పట్టణీకరణ సంతరించుకుంటుందని వివరించారు. భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాల నాయకులందరూ విలీనానికి అనుకూలంగా ఏకగ్రీవ తీర్మానాలు చేశారన్నారు. 2011 సెన్సెస్ ప్రకారం జీవీఎంసీలో 3 మండలాల విలీనం సాధ్యపడదని, 2027 సెన్సెస్ తర్వాత ఆ ప్రక్రియకు అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారని తెలిపారు. ఈ ప్రతిపాదనలు సీఎంకు వివరించి ఆయన సూచన మేరకు తుదినిర్ణయం తీసుకుంటామన్నారు. వార్డుల పునర్విభజనలో భీమిలి జోన్ లోని 4 వార్డుల సంఖ్య 5 కు, మధురవాడ జోన్ లోని 4 వార్డుల సంఖ్య 6 కు పెరుగుతోందని, అయితే హద్దుల విషయంలో అందరికీ ఆమోదయోగ్యమైన తుది నిర్ణయం ఉంటుందని గంటా చెప్పారు. కొమ్మాది వరకు నిర్మించనున్న మెట్రో ను ఆనందపురం మీదుగా భోగాపురం వరకు పొడిగించి, ఐటీ సెజ్ కు మెట్రో లైన్ వేస్తే గానీ ప్రాజెక్టుకు సార్ధకత రాదన్నారు.



# సెయింట్ మార్క్ చారి టేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్లకు శిక్షణ

**అరకులోయ: జయ జయహే.**

అల్లూరి జిల్లా అరకు వేలి మండలం కేంద్రంలోని ఆదివాసి కాలనీ లో ఘనంగా సెయింట్ మార్క్ చారి టేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ ఉజ్జీవ కూడిక విచ్చేసిన ప్రతి ఒక్కరు చాలా దూర ప్రాంతం నుంచి దాదాపు 100మందికి పైగా హాజరవడం జరిగింది. ఏసుక్రీస్తు మన ప్రభువు దేవునిలో విశ్వాసం దేవునిలో ఎలాగ సాగాలో ఈ లోకంలో జరుగుతున్న చెడు అలవాటు నుంచి దేవుని దగ్గర ఎలా ఉండాలో చాలా చక్కగా బోధించిన ఇంటర్నేషనల్ స్పీకర్ స్టీఫెన్ ప్రసాద్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ గాస్పల్ పర్సిక్యూటివ్ సోల్స్ విశాఖపట్నం జీవన్ ఎంతో చక్కటి వర్తమానం అందించారు. ప్రార్థన చేయడం ప్రయత్నం చేయడం ఫలితం పొందడం ఎంతో చక్కటి వర్తమానం ఈ సందర్భంగా అందించారు. అనంతరం బాప్తిస్మము ఇచ్చారు. కొత్త కుట్టుమిషన్ నూతనంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది. సెయింట్ మార్క్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమం జరగడానికి సెయింట్ మార్క్ చర్చ్ స్థానిక సంఘ కాపరి సాలెం పాస్టర్ అధ్యక్షులు భూషణ్ అడ్మిన్ గీత సంఘ పెద్ద సమూయేల్ డుంబ్రిగూడ మండల ఎంపీపీ ఈశ్వరి .కృష్ణవేణి హిందీ మాస్టర్ ప్రసాద్ .అబ్రహం .మాస్టర్ ఎలీషా. సంఘస్తులందరూ పాల్గొనడం జరిగింది. కుట్టుమిషన్ నేర్చుకోవడానికి సంప్రదించుకునే నంబర్ 9494148067 9490266661. కాల్ చేయండి ధన్యవాదాలు.

# ఇంటర్ ఫలితాల్లో శ్రీ విశ్వ విజయ భేరి





**విశాఖపట్నం, ఏప్రిల్ 15, జయ జయహే**

ఇంటర్ ఫలితాల్లో శ్రీ విశ్వ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 470మార్కులకు ముచర్ల దీపిక గౌరీ 466 మార్కులు సాధించింది. ఎన్ను కుసుమ, పెంట బాల కృష్ణ, బోడ శ్రీ వెంకట ఆశిష్ బొడ్డేటి శాషిన్, సనపల సత్య తేజ, బోకం దీప్తి లోచన, సుతపల్లి శశి వదన్, పోతల భాను ప్రసాద్, మేడవల శ్రీ హన్సిక, ఎల్ల సంస్రిత, గారా కుందన ప్రియ తదితరులు 466మార్కులతో టాప్లో నిలిచారు. అలాగే బైపిసి లో 455మార్కులకు మేడపాటి నేహారెడ్డి, 451మార్కులు, గొల్లవిల్లి తేజ శ్రీ 447, నమ్మి సౌజన్య 446, దాడి స్ఫూర్తి వెంకట తేజస్విని 444 మార్కులు సాధించారు. ఎం పి సి లో 465కి పైగా మార్కులు సాధించిన వారు 45మంది కాగా, 460కి పైగా 211మంది, 450కి పైగా మార్కులు సాధించిన వారు 507మంది, బైపిసి లో 16మంది 445మార్కులకు పైగా, 35మంది 420 మార్కులకు పైగా సాధించారు. అలాగే సీనియర్ ఎంపిసి లో వెయ్యికి 991మార్కులు జి. కృష్ణ లహరి, 990మార్కులు దుపన గోపి చంద్, గర్నిపూడి శ్రీ సత్య సాయి ప్రవల్లిక, 989మార్కులు ఉమ్మెటల శ్రీ లయ, కొత్తకోట భార్గవి తెచ్చుకున్నారు. బైపీసీ లో వెయ్యి మార్కులకు మేక లక్ష్మి ప్రసన్న 989, ఎంపిసి లో 980కి పైగా మార్కులు సాధించిన వారు 94 మంది, 950కి పైగా సాధించిన వారు 537 మంది వున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులందరికీ శ్రీ విశ్వ విద్యా సంస్థల చైర్మన్ కే ఎస్ హెచ్ ఆర్ కె ధర్మ రాజు, డైరెక్టర్ పి. సూర్య నారాయణ అభినందనలు తెలిపారు.







## గోకవరం మండలానికి అగ్నిమాపక కేంద్రం అత్యవసరం


**గోకవరం జయ జయహే ప్రతినిధి**

గోకవరం మండలంలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక సిబ్బంది ఆలస్యంగా చేరుకోవడంతో భారీ నష్టం వాటిల్లుతున్నట్లు స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించే స్థాయిలో మండలంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడం వల్ల ఆస్తులు, పంటలు పూర్తిగా అగ్నికి ఆహుతి అవుతున్నాయని వారు చెబుతున్నారు.మండలంలోఎప్పుడైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే సమీప పట్టణాల నుండి అగ్నిమాపక వాహనాలు రావాల్సి వస్తోంది. ఈ లోపులో మంటలు అదుపు తప్పి ఇళ్లు, గోదాములు, వ్యవసాయ ఉత్పత్తులు పూర్తిగా బూడిదైపోతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. అగ్నిమాపక సిబ్బంది చేరేసరికి పరిస్థితి అదుపులోకి తేవడం కష్టమవుతోందని పలువురు తెలిపారు. గోకవరం మండలంలో మొత్తం 14 పంచాయతీలు ఉన్నప్పటికీ అగ్నిమాపక కేంద్రం లేకపోవడం ఆశ్చర్యకరమని ప్రజలు అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గడ్డి గోదాములు, వ్యవసాయ నిల్వలు, పాత ఇళ్ల నిర్మాణం ఎక్కువగా ఉండటంతో చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని వారు పేర్కొంటున్నారు. అగ్నిప్రమాదాల సమయంలో వెంటనే స్పందించేలా గోకవరం మండలంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటైతే ప్రమాదాలను వేగంగా అదుపులోకి తెచ్చి ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని తగ్గించవచ్చని అభిప్రాయపడుతున్నారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని గోకవరం మండలానికి అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



### జిటిడబ్ల్యూఏ పాఠశాలలో
## ప్రపంచ కళా దినోత్సవం

**అల్లూరి సీతారామరాజు జిల్లా (జయ జయహే)**



పాడేరు మండలం వనుగుపల్లి పంచాయితీ కందమామిడి జి టి డబ్ల్యూ ఏ బాలికల పాఠశాల నందు. ప్రపంచ కళా దినోత్సవం సందర్భంగా బాలికల స్కూలు నందు ప్రపంచంలో కళల సృష్టికర్త. లియొనార్డ్ ద విన్సీ. 15-4-1452 1452 .న పుట్టినరోజుసందర్భంగా ఏప్రిల్ 15న ప్రపంచ కళా దినోత్సవం గా గుర్తించబడినది. అదే సందర్భంలో కందమామిడి జి టి డబ్ల్యూ ఏ బాలికల పాఠశాల నందు 6,7, 8,9వ తరగతి పిల్లలకు ప్రపంచ కళా దినోత్సవం సందర్భంగా చిత్రలేఖన.. డ్రాయింగ్ పోటీలు నిర్వహించడం జరిగినది అని స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎ వెంకటలక్ష్మి తెలియజేస్తూ స్కూల్ పిల్లలలో ఇలాంటి చిత్రలేఖన పోటీల వలన పిల్లలకు మంచి అవగాహన డ్రాయింగ్ లో పై చదువులకు వెళ్ళటానికి ఉపయోగపడుతుందని చెప్పుకొచ్చారు కళలు ఆర్ట్స్ టిటిసి జనపరెడ్డి అప్పారావు స్కూల్ పిల్లలపై మంచి అవగాహనతో చెప్పుకొస్తూ ప్రతీ సంవత్సరం ఏప్రిల్ 15న రాష్ట్ర ప్రభుత్వం ద్వారా స్కూల్స్ విద్యార్థిని విద్యార్థులకు ప్రపంచ కళా దినోత్సవం సందర్భంగాచిత్ర కళలు పోటీలు నిర్వహిస్తుంటే మంచిదని చెప్పుకొచ్చారు

# వార్డుల్లో రూ. 300 కోట్లతో అభివృద్ధి పనులు: గంటా

**మధురవాడ, ఏప్రిల్ 15: (జయ జయహే )**

నియోజకవర్గంలోని 9 జీవీఎంసీ వార్డుల్లో రూ. 300 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. అలాగే రూ.వెయ్యి కోట్లతో మధురవాడలో తాగు నీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టులు తొందర్లోనే మొదలు పెట్టనున్నామని వెల్లడించారు. 6 వ వార్డులో రూ. 12 కోట్ల విలువైన 27 అభివృద్ధి పనులు.. రూ. కోటితో వార్డుల్లో పూడికతీత పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ 2014 - 19 లో రూ. 4,700 కోట్లతో అభివృద్ధి చేశానని, గంభీరంలో ఐఐఎం తీసుకువచ్చానన్నారు. ఆ స్థాయి అభివృద్ధి కోరుకునే గత ఎన్నికల్లో 93 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని అభివృద్ధి చేసి నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలో నాయకత్వం పటిష్టం చేయడానికి గత ఎన్నికల్లో ఆ జిల్లా చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని చంద్రబాబు సూచించినా.. భీమిలి ప్రజలు చూపించిన అభిమానంతో ఇక్కడి నుంచే పోటీ చేస్తానని ఒప్పించి మరీ టికెట్ తెచ్చుకున్నానన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని





నెరవేర్చామని, జీతాలు ఇవ్వలేని పరిస్థితి నుంచి ఉద్యోగులకు, సామాజిక పెన్షనర్లకు ప్రతి నెల 1 వ తేదీన క్రమం తప్పకుండా చెల్లించే స్థాయికి తీసుకెళ్లామని తెలియజేశారు. దేశ గతిని మార్చే గూగుల్ డేటా సెంటర్ కు ఈనెల 28న ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేస్తారన్నారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ప్రణాళిక రూపొందించామని, అలాగే 9 వార్డుల్లో 15 చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నాణ్యతలో రాజీ పడకుండా నిర్దేశిత సమయంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రత్నగిరి కాలనీ లోని కళ్యాణ మండపాన్ని పరిశీలించారు. తక్షణమే స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేయాలని జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడిని ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నేతలు చిక్కాల విజయ్ బాబు, గరే గుర్నాథ్, దాసరి శ్రీనివాస్, యార్లగడ్డ జీవన్ కుమార్, పిల్లా వెంకట్రావు, లొడగల అప్పారావు, మామిడి దుర్గారావు, పోతిన ప్రసాద్, లొడగల జానకిరామ్, పోతిన ప్రసాద్, సంతోష్ నాయుడు, నాగోతి సత్యనారాయణ, పోతిన శివ, రాజు, బోయి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



## టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ నజీర్

**విశాఖపట్నం జయ జయహే**

మైనార్టీలకు మరింత ప్రాధాన్యం నజీర్ ఎంపికతో పార్టీకి కొత్త ఉత్సాహం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలుగుదేశం పార్టీ జాతీయ కమిటీలో ముఖ్యమైన మార్పులు చేస్తూ పార్టీ అధిష్టానం మహమ్మద్ నజీర్ ని జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు విడుదలయ్యాయి. పార్టీ పట్ల ఆయన చూపించిన అచంచలమైన నిబద్ధత, కష్టపడే తత్వం, క్రమశిక్షణతో కూడిన రాజకీయ ప్రస్థానం, మైనార్టీ వర్గాల మధ్య బలమైన అనుబంధాన్ని పరిగణలోకి తీసుకుని ఈ కీలక బాధ్యతను అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నజీర్ సేవలను గుర్తించి ఈ ఉన్నత పదవిని అప్పగించడం విశేషంగా భావిస్తున్నారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు బలోపేతం చేయడంలో నజీర్ మరింత చురుకుగా వ్యవహరిస్తారని నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మహమ్మద్ నజీర్ గత కొన్నేళ్లుగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ, ముఖ్యంగా మైనార్టీ వర్గాల సమస్యలను వెలికి తీసి పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నారు. ఆయన నాయకత్వం, సమన్వయ నైపుణ్యం, ప్రజలతో మమేకమయ్యే స్వభావం పార్టీకి పెద్ద ఆస్తిగా నిలుస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నియామకం ద్వారా మైనార్టీ వర్గాల్లో తెలుగుదేశం పార్టీకి మరింత ఆదరణ పెరిగే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అదేవిధంగా, పార్టీ జాతీయ కమిటీలో చోటుచేసుకున్న ఈ మార్పు రాబోయే ఎన్నికల నేపథ్యంలో వ్యూహాత్మక నిర్ణయంగా కూడా భావిస్తున్నారు. పార్టీని అన్ని వర్గాలకు చేరువ చేయడమే లక్ష్యంగా ఈ నియామకం జరిగిందని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

**మొహమ్మద్ రహమతుల్లా అభినందనలు వెల్లువ**

మహమ్మద్ నజీర్ జాతీయ ఉపాధ్యక్షులుగా ఎంపిక కావడం పట్ల నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు మొహమ్మద్ రహమతుల్లా హర్షం వ్యక్తం చేశారు. నజీర్ కృషికి ఇది తగిన గుర్తింపు అని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, ముఖ్యంగా మైనార్టీ వర్గాలకు ఆయన అండగా నిలుస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

నజీర్ చేపట్టిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించి పార్టీకి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షిస్తూ వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.





## గోకవరంలో జియో నెట్‌వర్క్‌పై వినియోగదారుల ఆగ్రహం... ఎయిర్టెల్ వైపు పరుగులు!

**గోకవరం జయ జయహే ప్రతినిధి**

గోకవరం మండలంలో జియో మొబైల్ నెట్‌వర్క్ సేవలపై వినియోగదారుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఇన్‌కమింగ్ కాల్స్, అవుట్‌గోయింగ్ కాల్స్ సరిగా పనిచేయకపోవడంతో పాటు ఇంటర్నెట్ సేవలు కూడా తరచూ నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో కూడా ఫోన్ కాల్స్ కనెక్ట్ కాకపోవడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.

గ్రామాల్లోనే కాకుండా గోకవరం పట్టణ పరిసర ప్రాంతాల్లో కూడా సిగ్నల్ సమస్య మరింత పెరిగిందని వినియోగదారులు వాపోతున్నారు. మొబైల్ డేటా పూర్తిగా పనిచేయకపోవడంతో విద్యార్థులు ఆన్‌లైన్ చదువులకు, వ్యాపారులు డిజిటల్ లావాదేవీలకు, ఉద్యోగులు అధికారిక పనులకు ఆటంకాలు ఎదుర్కొంటున్నారు.

ఈ పరిస్థితుల్లో వినియోగదారులు ప్రత్యామ్నాయంగా ఎయిర్టెల్ నెట్‌వర్క్ వైపు మొగ్గు చూపుతున్నారని సమాచారం. గత వారం రోజులలోనే సుమారు 300 మంది వరకు జియో వినియోగదారులు తమ నంబర్లను ఎయిర్టెల్‌కు పోర్ట్ చేసుకున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరింత మంది వినియోగదారులు మారే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

నెట్‌వర్క్ సమస్యపై సంబంధిత సంస్థ అధికారులు ఇప్పటివరకు స్పందించకపోవడం వినియోగదారుల్లో అసంతృప్తిని మరింత పెంచుతోంది. సేవలు అందించలేకపోతే భారీగా రీచార్జ్‌లు ఎందుకు వసూలు చేస్తున్నారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఇకపైనా పరిస్థితి మారకపోతే వినియోగదారులు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టే అవకాశముందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. గోకవరం ప్రాంతంలో జియో సంస్థ తక్షణమే నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

For a pure tomorrow.. జయహే

# నామినేటెడ్ పోస్టుల భర్తీకి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్

## తెలంగాణలో కాంగ్రెస్ నేతలకు శుభవార్త..

### సీఎం రేవంత్‌తో మీనాక్షి, మహేష్‌కుమార్ భేటీ... డీలిమిటేషన్‌పై కీలక చర్చ

జయ జయహే

తెలంగాణలో కాంగ్రెస్ నేతలకు శుభవార్త అందింది. త్వరలోనే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. దీంతో ఎప్పటి నుంచో నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్న ఆశావహుల్లో ఇప్పుడు కొత్త ఆశలు రేకెత్తుతున్నాయి. అయితే ఈ నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో పార్టీ కోసం పనిచేసిన వారు, సామాజిక సమీకరణాలను ఆధారంగా చేసుకుని.. నియమించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అసమ్మతి రేగకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు తెలంగాణలో నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ త్వరలోనే మొదలు కానుంది. దీంతో గంపెడు ఆశలతో ఉన్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు.. ఇప్పుడు తమ ప్రయత్నాలు ప్రారంభించారు. బుధవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ భేటీ అయి.. నామినేటెడ్ పోస్టుల భర్తీ, అభ్యర్థుల ఎంపిక వంటి పలు విషయాలపై సమగ్రంగా చర్చలు జరిపారు. ఈ క్రమంలోనే నామినేటెడ్ పోస్టులను వీలైనంత తొందరగా భర్తీ చేసేందుకు.. ఈ కసరత్తు ప్రక్రియకు సీఎం రేవంత్ రెడ్డి పచ్చజెండా ఊపారు.కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం.. పార్టీ అభివృద్ధి కోసం నిత్యం శ్రమించిన నాయకులను గుర్తించి వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఇక ఈ నామినేటెడ్ పదవులను కేటాయించడంలో సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ఎవరికీ అన్యాయం జరగకుండా.. అన్ని వర్గాలను పరిగణలోకి తీసుకుని.. సమన్యాయం జరిగేలా ఆశావహుల జాబితాను తయారు చేసినట్లు తెలుస్తోంది. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ భేటీలో ప్రధానంగా



టీపీసీసీ కమిటీ కూర్పుపై దృష్టి పెట్టారు. వీటితోపాటు కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, జిల్లా స్థాయి కమిటీల భర్తీపైనా తుది నిర్ణయం తీసుకున్నారు. ఇక ఇప్పటికే జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టుల లిస్టను పార్టీ హైకమాండ్ రెడీ చేసింది. అర్హత, కష్టపడేతత్వం ఉన్న వారికే ఈ పోస్టుల్లో ప్రాధాన్యతనివ్వాలని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఇందులో గ్రూపు రాజకీయాలకు ఎలాంటి ఆస్కారం లేకుండా కేవలం మెరిట్ ఆధారంగానే ఎంపిక జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

అదే సమయంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ బలోపేతంపైనా నేతలు కూలంకషంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు మరింత ఉత్సాహంగా పని చేసేలా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. దీంతో ఏళ్లుగా కాంగ్రెస్ జెండా మోసిన సామాన్య కార్యకర్తలకు కూడా ఈసారి పదవులు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా మహిళలు, వెనుకబడిన వర్గాలకు ఈ నామినేటెడ్ పోస్టుల ఎంపికలో స్థానం కల్పించడం ద్వారా పార్టీ పునాదులను మరింత బలోపేతం చేయాలని నేతలు నిర్ణయం తీసుకున్నారు. ఇక ఇందులో భాగంగానే త్వరలోనే మొదటి విడత నామినేటెడ్ పోస్టుల లిస్టను కాంగ్రెస్ పార్టీ రిలీజ్ చేయనుంది. జిల్లాల అధ్యక్షులు.. మండల స్థాయి నేతల అభిప్రాయాలను సేకరించి.. ఈ పదవుల ఎంపికను పూర్తి చేశారు.

# సిఎం రేవంత్ తీరుపై బిజెపి మండిపాటు

### అనుమానాలతో గందరగోళం సృష్టించవద్దు

### రేవంత్ ప్రధానికి లేఖ రాయడంపై పార్టీ నేతల విమర్శలు

జయ జయహే

మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై సిఎం రేవంత్ రెడ్డి అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రెంటినీ కలపడాన్ని కుట్ర కోణంగా అభిప్రాయపడ్డారు. దీనిపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధానికి లేఖ రాశారు. అయితే రేవంత్ అభిప్రాయాలను బిజెపి నేతలు తోసిపుచ్చారు. పార్లమెంట్ అత్యున్నత వేదిక అని, అక్కడే జరగబోతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్‌కు అవగాహన లేదని బండి సంజయ్ కూడా వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాసిన లేఖపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కూడా స్పందించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. భయాన్ని వ్యాప్తి చేయడం ఆపండి. రాజ్యాంగం లోని ఆర్టికల్ 81ను చదవండి. డీలిమిటేషన్ కేవలం జనాభాపైనే ఆధారపడదు. అవసరమైన ఇతర అంశాలను కూడా డీలిమిటేషన్ కమిషన్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. సీట్ల పెంపు కోసం ఏ ఫార్ములాను అనుసరించాలనే నిర్ణయాన్ని ఆ కమిషన్‌కే వదిలారు. అయినా ఎలాంటి కారణం లేకుండా మీరు రాజకీయాలు చేస్తున్నారు.. షేమ్ అని రామచందర్‌రావు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దని రేవంత్ అన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలని కోరారు. కీలక నిర్ణయాల్లో రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలి. డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు, రాజకీయపార్టీల ఏకాభిప్రాయం సాధించాలి. నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు. జాతీయస్థాయిలో విస్తృత అభిప్రాయ సేకరణ తర్వాతే డీలిమిటేషన్ చేయాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో రామచందర్‌రావు స్పందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇలాంటి అనుమానాలతు, వ్యాఖ్యలతో ఉత్తరాది, దక్షిణాది మధ్య విభేదాలు సృష్టించవద్దని కిషన్ రెడ్డి అన్నారు.

### శ్రీ శ్రీ శ్రీ గంగాలమ్మ అమ్మవారి

# జాతర మహోత్సవములు

గోకవరం జయ జయహే ప్రతినిధి



**గోకవరం నుండి రాజమండ్రి వెళ్లే దారిలో ఉన్న శ్రీశ్రీశ్రీ గంగాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈనెల 19వ తేదీ ఆదివారం నుండి ప్రారంభమై 21వ తేదీ మంగళవారం వరకు అత్యంత వైభవంగా ఈ అమ్మవారి జాతర ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజు ఆలయ ప్రాంగణంలో గరగల నృత్య ప్రదర్శనలు అంగరంగ వైభవంగా ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. 21 వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటల నుండి గొప్ప అన్న సమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులందరూ విచ్చేసి అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు శివరామకృష్ణ, చక్కర్రావు, పాండు, శ్రీనివాస రావు, చిట్టి బాబు, కోరారు.**



### తాటిమానుపాలెంలో

# బిజెపి మండల సమావేశం

కొయ్యురు (జయ జయహే )న్యూస్, ఏప్రిల్ 16

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం, అంతాడ పంచాయతీ, తాటిమానుపాలెం గ్రామంలో బుధవారం మండల అధ్యక్షులు సంపరి శివకుమార్ ఆధ్వర్యంలో బిజెపి మండల సమావేశం నిర్వహించడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి, మండల అధ్యక్షులు సంపరి శివకుమార్ మాట్లాడుతూ, కొయ్యూరు మండలంలో ప్రతీ పంచాయతీలో బూత్ కమిటీలు బలోపేతానికి కృషి చేయాలని మరియు మండలంలోని పార్టీ దిమ్మలు నిర్మాణాలు చేపట్టాలన్నారు మరియు స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. 27,28,29 తేదీలలో ( శరభన్నపాలెం కేంద్రంగా) నిర్వహించబోయే ప్రారంభిక కార్యక్రమానికి ప్రతీ పంచాయితీ నుంచి యువకులను సమీకరణ చేసి, శిక్షణ కార్యక్రమానికి తీసుకురావాలని, అదే విధంగా మండలంలో అన్ని పంచాయతీల సచివాలయ సిబ్బంది ప్రజల ఫోన్ కాల్స్ పై స్పందించడం లేదని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫోన్ కాల్స్ కి రెస్పాన్స్ అవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ రీమల చంద్రరావు, మాజీ బిజెపి గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు అరిమెల రాజు, బిజెపి జిల్లా కార్యదర్శి బచ్చల అన్నపూర్ణ, మండల ఉపాధ్యక్షులు వనముల మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి సెగ్గె సన్యాసిరావు, మండల కార్యదర్శి చిన్ని రాజు, మాజీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు నెల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



### క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన

# రామసేన సభ్యులు

గోకవరం జయ జయహే ప్రతినిధి

గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించిన శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి క్రికెట్ టోర్నమెంట్ ని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు బుధవారం ప్రారంభించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ కి కంబాల శ్రీనివాసరావు మొదటి బహుమతి 22,222,రెండొవ బహుమతి 11,111, ట్రోఫీలకు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు బత్తుల నానాజీ, కంబాల యువసేన అధ్యక్షులు, ఉంగరాల మణిరత్నం, పెద్దాడ వెంకన్న దొర, మండే గౌతమ్, అంబటి శ్రీను, పడాల రాము, పలు క్రికెట్ టీమ్ జట్లు, స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా మరోకసారి అవకాశం దక్కించుకున్న ఎం వి వి ప్రసాద్..

కొయ్యురు (జయ జయహే )న్యూస్ ఏప్రిల్ 16



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎం.వి.వి ప్రసాద్‌కు మరోకసారి అవకాశం కల్పించిన పార్టీ జాతీయ నాయకులు నారా చంద్రబాబు నాయుడుకు విద్యాశాఖ మాత్యులు లోకేష్ కి పాడేరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు శ్రేయోభిలాషులు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల తరఫున ప్రత్యేక ధన్యవాదములు, శుభాభినందనలు తెలిపారు.తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అలాగే మరోకసారి అవకాశ దక్కించుకున్న ఎం వి వి ప్రసాద్ కి కార్యకర్తలు నాయకులు శుభాభినందనలు తెలియజేస్తూ పార్టీ బలోపేతానికి సాయి శక్తుల కృషి చేయాలని ప్రజా శ్రేయస్సుకి చింతపల్లి, కొయ్యూరు, జీకే వీధి మండలాల అభివృద్ధికి నూతన ఉత్తేజంతో తమ వంతు పని చేయాలని ఆశిస్తూ ఆకాంక్షిస్తూ తెలుగుదేశం పార్టీ శ్రేయోభిలాషులు కోరుకుంటున్నారు...

# ఇంటర్ ఫలితాల్లో కస్తూరిబాయ్ విద్యార్థులు ప్రతిభ

బుచ్చయ్య పేట జయ జయహే

ఇంటర్ మొదటి రెండవ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో బుచ్చయ్య పేట మండలం వడ్డాది కస్తూరిబాయ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు ఇంటర్ మొదటి సంవత్సరం 40 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుగా 40 మంది విద్యార్థులు పాసయ్యారు మొదటి సంవత్సరంలో ముచకర్ల రేవతి 455 మార్కులుగాను 447 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది సిహెచ్ అనూష 441 మార్కులు సాధించి రెండవ స్థానంలోనూ ఎన్ అనూష 439 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచింది అలాగే రెండవ సంవత్సరంలో 39 మంది విద్యార్థులు పరీక్ష హాజరవుగా 39 మంది ఉత్తీర్ణ అయ్యారు రెండవ సంవత్సరం బైపిసి ఫలితాల్లో 968 మార్కులతో వై స్వాతి ప్రథమ స్థానంలో నిలిచింది 9 61 మార్కులతో నక్క మోహన విజయ కుమారి 2వ స్థానంలో 951 మార్కులతో టి అనూష 3వ స్థానంలో నిలిచి ఉత్తీర్ణయ్యారు వడ్డాది కేజీబీవీలో 100% ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులను ఎస్ఎంసి చైర్మన్ ఎడ్ల సత్యవేణి ఇంచార్జ ప్రిన్సిపల్ సంసద్ బేగం స్థానిక నాయకులు అభినందించారు అలాగే వడ్డాది జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 86 శాతం ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 57 శాతం ఉత్తీర్ణ అయ్యారని ప్రిన్సిపాల్ జి చిన్నారావు తెలిపారు

### పూడి శ్రీహరి అరెస్ట్‌పై

# మార్గాని భరత్ ఆగ్రహం

రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి (మీడియా విభాగం) పూడి శ్రీహరి అరెస్ట్‌ను పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ తీవ్రంగా ఖండించారు. అంబేద్కర్ జయంతి రోజున ఈ అరెస్ట్ జరగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు.అరెస్టు వారెంట్ లేకుండా, నోటీసు ఇవ్వకుండా పోలీసులు సివిల్ డ్రెస్‌లో వెళ్లి బలవంతంగా తీసుకెళ్లడం సుప్రీంకోర్టు మార్గదర్శకాల ఉల్లంఘన అని పేర్కొన్నారు. మాట్లాడే హక్కును హరించేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ ఘటన మానవ హక్కుల ఉల్లంఘనగా పేర్కొంటూ, బాధ్యులపై చర్యలు తీసుకుని పూడి శ్రీహరిని వెంటనే విడుదల చేయాలని డీజీపీని కోరారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com